


టీడీపీ సభ్యత్వ నమోదులో కుప్పానికి 2వ స్థానం



కుప్పం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే కుప్పం నియోజకవర్గానికి రెండవ స్థానం దక్కింది. పార్టీ కార్యకర్తలు, నాయకులు కలసిమెలసి గ్రామా గ్రామానా తిరుగుతూ సభ్యత్వం చేయించారు. కుప్పం నియోజకవర్గంలో మొత్తం 2,25,777 మంది ఓటర్లుండగా, అందులో గురువారం దాకా 70,850 మంది టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. మళ్లీ ఇందులో రామకుప్పం మండలం 41 శాతం సభ్యత్వ నమోదుతో మొదటి స్థానంలో ఉండగా, 20 శాతం సభ్యత్వ నమోదుతో గుడుపల్లె మండలం చివరి స్థానంతో సరిపెట్టుకుంది. కుప్పం, శాంతిపురం, కుప్పం మున్సిపాలిటీ వరుసగా 34, 30, 28, శాతం సభ్యత్వ నమోదుతో రెండవ, మూడవ, నాల్గవ స్థానాలలో నిలిచాయి. ఈ ఘనత సాధించిన కుప్పం టీడీపీ నాయకులను, కార్యకర్తలను గురువారం ఆర్టీసీ వైస్ ఛైర్మన్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం అభినందించారు. త్వరలోనే మొదటి స్థానానికి చేరాలని ఆకాంక్షించారు.

అడ్మిన్ ఇన్‌చార్జి ఏఎస్పీగా రాజశేఖర్‌రాజు



చిత్తూరు అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అడ్మిన్ ఇన్‌చార్జి ఏఎస్పీగా ఎస్ఆర్ రాజశేఖర్ రాజు గురువారం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన ఏఎస్పీల సాధారణ బదిలీల్లో భాగంగా అన్నమయ్య జిల్లాలో అడ్మిన్ ఏఎస్పీగా ఉన్న ఈయన జిల్లా ఆపరేషన్ ఏఎస్పీగా వచ్చారు. ఎస్పీ మణికంఠ ఆదేశాలతో గురువారం ఇన్‌చార్జి అడ్మిన్ ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు.

చిన్నారుల ఆరోగ్యం ఇక పదిలం

- స్కూల్ హెల్త్ స్ర్కీనింగ్ పేరుతో 18 ఏళ్ల లోపున్న ప్రతి విద్యార్థికీ పరీక్షలు
- ఆరోగ్యశ్రీ అవసరం లేకుండా ఉచిత సర్జరీలు

రాష్ట్ర ప్రభుత్వం బాలల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తోంది. స్కూల్ హెల్త్ స్ర్కీనింగ్ కార్యక్రమం పేరుతో 18 ఏళ్ల లోపున్న ప్రతి విద్యార్థికీ ఆరోగ్య పరీక్షలు చేసి వివరాలు రికార్డుల్లో నమోదు చేయనున్నారు.బాలల దినోత్సవం సందర్భంగా ఈనెల 14 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం ఏప్రిల్ వరకూ కొనసాగనుంది.

- చిత్తూరు రూరల్, ఆంధ్రజ్యోతి



పులిచెర్ల మండలం కల్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో స్కూల్ హెల్త్ స్ర్కీనింగ్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి

● ప్రతి విద్యార్థికీ బుక్‌లెట్

స్కూల్ హెల్త్ స్ర్కీనింగ్ కార్యక్రమంలో ప్రతి విద్యార్థికీ బుక్‌లెట్ లాంటి కార్డు ఇస్తారు. ఇందులో విద్యార్థి వివరాలతో పాటు కుటుంబంలో ఎవరికైనా రక్తపోటు, క్యాన్సర్, మూర్ఛ, షుగర్, చూపు లోపం, వినికిడి లోపం, ఆస్తమా, గుండె జబ్బులు,రక్త సంబంధీకులతో వివాహం వంటి వివరాలు నమోదు చేస్తారు. అత్యవసర సమయాల్లో సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు(వైద్యులు, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఐటీడీఏ టోల్‌ఫ్రీ) ఉంటాయి. వయసుల వారీగా విద్యార్థుల ఎదుగుదల, ఎత్తు, బరువు, ఛాతీ కొలతలు నమోదు చేస్తారు. రక్తహీనత, విటమిన్ల లోపాలు, చర్మవ్యాధులతో పాటు 44 వ్యాధులకు సంబంధించి పరీక్షించిన తేదీ, వ్యాధుల నిర్ధారణ, అవసరమైన చికిత్స వివరాలు తెలియజేస్తారు.



విద్యార్థుల వివరాలు నమోదు చేసే కార్డు

● చికిత్స ఇలా...

అంగన్‌వాడీల్లో, పాఠశాలల్లో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించిన తర్వాత జబ్బు లక్షణాలు కన్పిస్తే ఏఎన్ఎంలు చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన డీఈఐసీ కేంద్రానికి పంపుతారు. అక్కడ పరీక్షలు చేశాక నయం చేయగలిగితే వైద్యులు చికిత్స అందిస్తారు. లేదంటే తిరుపతి, ఇతర ప్రముఖ నగరాల్లోని నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తారు. ఇక్కడ ఏ కార్డూ అవసరం లేకుండా ఫ్రీగా ఆపరేషన్లు నిర్వహిస్తారు. విద్యార్థులను నెట్‌వర్క్ ఆస్పత్రికి పంపేందుకు ప్రభుత్వం జిల్లాకు ఒక వాహనాన్ని కేటాయించింది. ఇందులో విద్యార్థి తల్లిదండ్రులతో పాటు వైద్య సిబ్బందిలో ఒకరిని పంపుతారు.

15.38 లక్షలమంది విద్యార్థులకు లబ్ధి

జిల్లాలోని 2470 ప్రభుత్వ పాఠశాలల్లో 14,84,483 మంది విద్యార్థులు, 2420 అంగన్‌వాడీ కేంద్రాల్లో 54293 మంది పిల్లలు చదువుతున్నారు. ఒక్కో పీహెచ్‌సీ పరిధిలో 10 టీములకు పైగా ఉంటాయి. ఒక్కో టీం సభ్యులు రోజుకు 30మంది విద్యార్థుల చొప్పున వారానికి రెండు రోజులు పరీక్షలు నిర్వహిస్తారు.స్కూల్ హెల్త్ స్ర్కీనింగ్ కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేస్తే జిల్లాలో చిన్నారుల మరణాలను బాగా తగ్గించవచ్చు.ఇందు కోసం చిన్నారుల తల్లిదండ్రులు కూడా సహకరించాలని డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి కోరారు. నమోదు సమయంలో పిల్లల తల్లిదండ్రులకు వచ్చే ఓటీపీని చెప్పాల్సి ఉంటుందన్నారు. ప్రతి వైద్యాధికారీ ఈ కార్యక్రమ అమలును తనిఖీ చేస్తారని, తాను జిల్లా అంతటా పరిశీలిస్తున్నానన్నారు.

పీఏసీఎస్‌ల్లో కంప్యూటరైజేషన్ రెండ్రోజుల్లోగా పూర్తిచేయాలి: జేసీ

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘా(పీఏసీఎస్)ల్లో కంప్యూటరీకరణ ప్రక్రియను 48 గంటల్లోగా పూర్తి చేయాలని జేసీ విద్యాధరి ఆదేశించారు. స్థానిక డీసీసీబీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో సహకార శాఖ అధికారులు, సిబ్బందికి కంప్యూటరైజేషన్‌పై రెండ్రోజుల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జేసీ మాట్లాడుతూ.. ఈ ఏడాది మార్చి 31వ తేదీవరకు జరిగిన లావాదేవీలన్నీ డేటా కేప్చర్ టూల్ (డీసీటీ) అనే సాఫ్ట్‌వేర్‌తో ఆన్‌లైన్ చేయాలని ఇదివరకే ప్రభుత్వం ఆదేశించినట్లు చెప్పారు. జిల్లాలోని 37 సంఘాలకుగాను 50శాతం మేర కంప్యూటరీకరణ నత్తనడకలో సాగుతున్నదని చెప్పారు. సంఘాల్లో సభ్యుల వివరాలను ఆన్‌లైన్ చేయలేదని పేర్కొన్నారు. మరో 48 గంటల్లోగా అన్ని సంఘాల్లో డేటా కంప్యూటరీకరణ పూర్తికావాలని ఆదేశించారు. ఆప్కాబ్ చీఫ్ జనరల్ మేనేజర్ రామచంద్రయ్య, కో-ఆపరేటివ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి డీఆర్ అనిల్, డీసీవో నాగవర్ధన, డీఆర్వో వనజ, డీసీఏవో బ్రహ్మానంద రెడ్డి, సీఈవో మనోహర్ గౌడ్, డీజీఎం శంకర్ బాబు, లిల్లీ కేథరిన్, వెంకటా చలపతి తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం తిరిగి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సహకారశాఖ అధికారులతో డేటా కంప్యూటరీకరణ ప్రగతిపై సూచనలు జారీచేశారు.



కర్నూలులోని జిల్లా సెషన్స్ కోర్టు

ఇక న్యాయం.. సత్వరం..

- కర్నూలులో హైకోర్టు బెంచ్‌కు అసెంబ్లీలో తీర్మానం
- స్వాగతిస్తున్న జిల్లా న్యాయవాదులు, ప్రజలు

చిత్తూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు శాశ్వత బెంచ్ ఏర్పాటు చేసేందుకు అసెంబ్లీలో గురువారం ఏకగ్రీవ తీర్మానం చేయడంపై జిల్లా న్యాయవాదులతో పాటు కక్షిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.అమరావతిలోని హైకోర్టులో రాయలసీమ జిల్లాలకు చెందిన కేసులే 50 శాతానికి పైగా వున్న నేపథ్యంలో కర్నూలులో బెంచ్ ఏర్పాటుతో అవన్నీ ఇక్కడికి బదిలీ కానున్నాయి. దీంతో ఎనిమిది జిల్లాల ప్రజలకు హైకోర్టు బెంచ్ ఉపయోగకరం కానుంది.

కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలనే డిమాండ్ దశాబ్దాల కాలం నాటిది. పాలకుల నిర్లక్ష్యం కారణంగా అది స్వప్నంగానే మిగిలిపోయింది. 2019 ఎన్నికలకు ముందు చంద్రబాబు కూడా ఈ హామీ ఇచ్చి వున్నారు. అయితే ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో అది అమలు కాలేదు. కర్నూలును న్యాయ రాజధానిగా ప్రకటించి హైకోర్టును కర్నూలుకు తరలిస్తామని వైసీపీ ప్రభుత్వం ప్రకటించినా.. ఆ దిశగా అడుగులు పడలేదు.



మా కల నెరవేరింది

కర్నూలులో బెంచ్ ఏర్పాటుతో ఇక కేసులు త్వరగా పరిష్కారం అవుతాయి. జడ్జిలకు, సిబ్బందికి పని ఒత్తిడి తగ్గుతుంది. బెంచ్ ఏర్పాటు కోసం ఏళ్లుగా పోరాడుతుంటే ఇప్పుడు మా కల నెరవేరింది. ఇక మా ప్రాంత అడ్వకేట్లు వెళ్లి హైకోర్టులో ప్రాక్టీసు చేసుకోవచ్చు. సమస్యలున్న ప్రజలకు మేలు జరుగుతుంది. కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం గొప్ప విషయం.

- అశోక్ ఆనంద్ యాదవ్, చిత్తూరు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి



ఏళ్లుగా పోరాడుతున్నాం

హైకోర్టు బెంచ్ ఏర్పాటు తీర్మానాన్ని స్వాగతిస్తున్నాం. దీనికోసం చాలా ఏళ్లుగా పోరాడుతున్నాం. బెంచ్ ఏర్పాటైతే హైకోర్టులోని సగం పెండింగ్ కేసులు ఇక్కడికి వచ్చేస్తాయి.త్వరగా పరిష్కారమైపోతాయి. ఏర్పాటుకు బాగా సమయం పడుతుంది. అసెంబ్లీ తీర్మానాన్ని హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు పంపాలి. ఆయన దాన్ని పరిశీలించి ఆమోదం కోసం రాష్ట్రపతికి పంపిస్తారు. అక్కడ్నుంచి ఆమోదం పొంది గెజిట్ విడుదల కావాలి. మళ్లీ కర్నూలులో భవన నిర్మాణం జరగాలి.

- యోగానంద్, సీనియర్ న్యాయవాది, చిత్తూరు

● బెంచ్ కోసం ఇక్కడా ఆందోళనలు

చిత్తూరు జిల్లా న్యాయవాదులు కూడా రాయలసీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని ఏళ్లుగా పోరాటం చేస్తున్నారు.కోర్టు విధుల్ని బహిష్కరించి ధర్నా చేయడం, రహదారులపై బైఠాయించడం, వంటా వార్పులతో నిరసనలు వ్యక్తం చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం బెంచ్ ఏర్పాటుకు ముందడుగు వేయడంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● ఉపయోగాలివీ

రాయలసీమలోని నాలుగు జిల్లాలకు చెందిన కేసులన్నీ హైకోర్టు నుంచి కర్నూలు బెంచ్‌కు తరలిస్తారు. దీంతో పెండింగ్ కేసుల పరిష్కారం వేగవంతం కానుంది. హైకోర్టులో కేసులున్న జిల్లావాసులు, న్యాయవాదులు అమరావతికి వెళ్లకుండా ఇక కర్నూలుకు వెళ్లొచ్చు. అమరావతి హైకోర్టు కన్నా కర్నూలు సుమారు 120 కిలోమీటర్లు దగ్గర. అమరావతిలో వసతి ఖర్చులు కూడా బాగా ఎక్కువ. కేసు పని మీద వెళ్లిన వారు రెండు మూడు రోజులు అక్కడే ఉండాలంటే బాగా ఖర్చుతో కూడుకున్న పని. అదే కర్నూలులో అమరావతి స్థాయిలో ఖర్చుండదు. హైకోర్టు బెంచ్ ఏర్పాటుతో అక్కడ ప్రాక్టీస్ చేసే న్యాయవాదుల సంఖ్య పెరుగుతుంది.

కూటమి చెంతకు కార్పొరేటర్లు

- తిరుపతి నుంచి విజయవాడకు 12మంది పయనం
- మంత్రులు లోకేశ్, అనగానితో నేడు అపాయింట్మెంట్
- టచ్‌లో మరో ఏడుగురు కార్పొరేటర్లు
- ఇప్పటికే కూటమిలో ఆరుగురు కార్పొరేటర్లు
- మొత్తం 25మంది బలంతో అవిశ్వాస తీర్మానానికి



తిరుపతి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రెండున్నరేళ్లు దాటాక అవిశ్వాస తీర్మానం పెట్టేలా పురపాలక చట్టానికి గురువారం అసెంబ్లీలో ప్రభుత్వం సవరణ చేసిన నేపథ్యంలో తిరుపతిలోని కూటమి పార్టీల నాయకులు వేగంగా పావులు కదుపుతున్నారు.కూటమి ముఖ్యనేతలను కలిసేందుకు వైసీపీ కార్పొరేటర్లు విజయవాడకు వెళ్లారు. రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పార్థసారధిని కలిసినట్టు తెలుస్తోంది. అదేవిధంగా టీడీపీ యువనేత, మంత్రి లోకేశ్, జిల్లా ఇంఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ అపాయిమ్మెంట్ శుక్రవారం తీసుకున్నట్టు సమాచారం.డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు, మహిళా కార్పొరేటర్ల కుటుంబసభ్యులు పొన్నాల చంద్ర, దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, కుడితి సుబ్రమణ్యం, పెంచలయ్య, దూది కుమారి, సీకే రవి, అన్నా అనిత, అన్నా సంధ్య, ఆదం లీలావతి తదితరులు విజయవాడకు వెళ్లినవారిలో ఉన్నట్టు సమాచారం. తన కుమార్తెను మేయర్ చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్న అన్నా రామచంద్రయ్య కూడా వీరితో వెళ్లారు. అదేవిధంగా పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంతానికి చెందిన ఓ సీనియర్ యువ కార్పొరేటర్, సింగాలగుంటకు చెందిన మరో కార్పొరేటరు అసంతృప్తితో ఉన్న ఏడుగురు వైసీపీ కార్పొరేటర్లను ఏకం చేసేపనిలో ఉన్నారు. విజయవాడకు వెళ్లినవారితో నిరంతరం టచ్‌లో ఉంటున్నట్టు తెలుస్తోంది.ఇప్పటికే కూటమి పార్టీలో ఉన్న ఆరుగురితో కలిపి 25 మంది కార్పొరేటర్ల బలం పెరిగాక అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే కూటమి నెగ్గే అవకాశం ఉంటుంది. అయితే ఈ బాధ్యతను రెండు పార్టీలతో సత్సంబంధాలు కలిగి, గత ఎన్నికల్లో క్రియాశీలకంగా పనిచేసిన తుడా మాజీ ఛైర్మన్‌కు అప్పగించనున్నట్టు తెలుస్తోంది.

● 50 డివిజన్లు ఉన్న తిరుపతి కార్పొరేషన్‌కు మూడున్నరేళ్ల క్రితం ఎన్నికలు జరిగాయి. నామినేషన్ ఉపసంహరణ సమయంలో వివాదం జరిగి ఒక డివిజన్‌కు ఎన్నిక ఆగిపోయింది. మిగిలిన 49 డివిజన్లలో అధికార బలంతో 28 డివిజన్లను వైసీపీ ఏకగ్రీవం చేసుకోగలిగింది. తక్కిన 21 డివిజన్లకు ఎన్నికలు జరిగితే ఒక్క డివిజన్లోనే టీడీపీ జెండా ఎగురవేసింది. దొంగఓట్లతో పాటు అధికార బలంతో వైసీపీ తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది.అసెంబ్లీ ఎన్నికల ముందు డిప్యూటీ మేయర్ అభినయ్ తన కార్పొరేటర్ పదవికి రాజీనామా చేశారు. అంతకుముందు నాయక్ అనే కార్పొరేటర్ మృతిచెందారు. అంటే మూడు డివిజన్లకు కార్పొరేటర్లు లేరు. మిగిలిన 47 డివిజన్లలోని కార్పొరేటర్లలో ఆధిపత్యం ఎటువైపు ఉంటే వారికే మేయర్ కుర్చీ దక్కుతుంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఐదుగురు కార్పొరేటర్లు వైసీపీని వీడి కూటమి పార్టీల్లో చేరారు. ఇద్దరు టీడీపీలోకి, ముగ్గురు జనసేనలోకి మారారు. కొత్తగా చేరబోయే కార్పొరేటర్లతో కూటమి పార్టీలకు సరిపడా మెజారిటీ ఉండబోతోంది. చట్టసవరణ నేపథ్యంలో మేయర్ డాక్టర్ శిరీష అవిశ్వాసానికి మానసికంగా సిద్ధపడినట్టు తెలుస్తోంది.

డీఎంఏకి ఏమైంది..?

- విచారణ ఎదుర్కొంటున్న వర్మ, చిట్టిబాబులపై ప్రేమ
- తిరుపతిలో పోస్టింగ్ ఇచ్చేందుకు పరిశీలించమని కమిషనర్‌కు లేఖ

తిరుపతి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగర పాలకసంస్థలో అవినీతి ఆరోపణలతో విచారణ ఎదుర్కొంటున్న పూర్వ అధికారులపై డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (డీఎంఏ) హరినారాయణ అవ్యాజమైన ప్రేమను ప్రదర్శిస్తుండడం ఆశ్చర్యం గొలుపుతోంది. మంత్రి నారా లోకేశ్‌కు అందిన ఫిర్యాదులపై మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఆదేశాలతో డీఎంఏ విచారణకు ఆదేశించారు. అనంతపురం రీజనల్ డైరెక్టర్ విశ్వనాథ్ నేతృత్వంలో 9 మంది సభ్యులతో కమిటీని నియమించారు. గత వారం రోజులుగా తిరుపతి కార్పొరేషన్‌లో రెవెన్యూ ఆఫీసర్ (ఆర్వో)గా పనిచేసిన కేఎల్ వర్మ, మేనేజర్ చిట్టిబాబులతో పాటు డీఈ విజయకుమార్ రెడ్డిలపై లోతైన విచారణ జరుగుతున్న నేపథ్యంలో డీఎంఏ పంపిన లేఖ మున్సిపల్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. తిరుపతి ఆర్వో నుంచి బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిపాలనాధికారిగా బదిలీ అయిన కేఎల్ వర్మను, అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ పరిపాలన అధికారిగా బదిలీ అయిన మేనేజర్ చిట్టిబాబును తిరిగి తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు తీసుకునేందుకు పరిశీలించాలని కమిషనర్ మౌర్యకు డీఎంఏ లేఖ రాయడం అందరినీ విస్తుపోయేలా చేసింది. ఆరోగ్య సమస్యలతో వర్మను, వ్యక్తిగత కారణాలపై చిట్టిబాబును తిరిగి తిరుపతి కార్పొరేషన్లోకి తీసుకోవాలని డీఎంఏ లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అవినీతి ఆరోపణల ఉన్న అధికారులపై నెలరోజుల క్రితం డీఎంఏ బదిలీ వేటు వేశారు. వారిపై ఆర్డీ నేతృత్వంలో విచారణకు ఆదేశించింది కూడా ఆయనే. అలాంటిది ఆ అధికారులను తిరిగి చేర్చుకోమని చెప్పడం కూడా ఆయనే కావడం పలు విమర్శలకు తావిస్తోంది.ఓ వైపు విచారణ జరుగుతుండగా మరోవైపు వారిని విధుల్లో చేర్చుకోమని లేఖ రాయడం వెనుక కొందరు అధికార పార్టీ పెద్దల ప్రమేయం ఉందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరి కమిషనర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాల్సి వుంది.

డ్రోన్ శిక్షణ, స్పేస్ టెక్నాలజీపై ఎస్వీయూ ఎంవోయూ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ శిక్షణ, స్పేస్ టెక్నాలజీపై పలు సంస్థలతో ఎస్వీయూ అవగాహనా ఒప్పందం చేసుకుంది. ఎర్త్ నౌ కంపెనీ, ఆర్ఎఫ్ఎల్‌వై ఇన్నోవేషన్ కన్సార్టియం ప్రతినిధులతో ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు గురువారం సమావేశమయ్యారు. డ్రోన్ల తయారీ, శిక్షణ, పరిశోధనలు చేపట్టడానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో రుసా కో-ఆర్డినేటర్లు రమాశ్రీ, ఉషారెడ్డి, సీఈవో వంశీకృష్ణ , తాండవకృష్ణ పాల్గొన్నారు.





ప్రమాదానికి ముందు వాగులో స్నేహితులు సరదాగా తీసుకున్న ఫొటో

స్నేహితులను కాపాడి అసువులు బాశాడు



మృతుడు హేమాద్రి

రేణిగుంట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వాగులో మునిగిపోతున్న ఇద్దరు స్నేహితులను కాపాడాడు. ఆ క్రమంలో తాను నీట మునిగి మృత్యుఒడికి చేరాడు 20 ఏళ్ల హేమాద్రి. రేణిగుంట మండలం మామండూరు వద్ద వాగులో గురువారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కడప జిల్లా పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన గంగరాజు కుమారుడు హేమాద్రి(20).. తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో బీఏ ఫైనలియర్ చదువుతున్నారు. తన ఎనిమిది మంది స్నేహితులతో కలిసి గురువారం మామండూరు అతిథిగృహం వద్దకు వచ్చారు. కొంతసేపు స్నేహితులంతా సరదాగా గడిపారు. ఆ తర్వాత ఈత కొట్టడానికి సమీప అటవీ ప్రాంతంలోని వాగు వద్దకు వెళ్లారు. ఈ వాగులోకి దిగి నడుము లోతులో ఉండే ప్రాంతంలో సరదాగా నీటిలో మునుగుతూ ఉన్నారు. ఈ క్రమంలో ఇద్దరు స్నేహితులు లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతంలోకి వెళ్లారు. ఈత రాక వారు మునిగిపోతుండడం గుర్తించిన హేమాద్రి.. తనకు ఈత రాకపోయినా తన స్నేహితులను కాపాడడానికి విఫలప్రయత్నం చేశారు. ఎట్టకేలకు ఇద్దరు స్నేహితులను కాపాడిన హేమాద్రి.. ఆ లోతు గుంతలో చిక్కుకుని మునిగిపోయారు. మిగిలిన వారు విలపిస్తూ సమీపంలోని స్థానికులను కలిసి తమ స్నేహితుడిని కాపాడాలని కోరారు.ఈ ప్రమాద సమాచారం తెలిసి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాగులో మునిగిపోయిన హేమాద్రి కోసం గాలించారు. కొంతసేపటి తర్వాత మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.





బోట్లలో వెళ్లి బాధితులను కాపాడుతున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

వరదల్లో చిక్కుకుంటే..!

భారీ వర్షాలు. అకస్మాత్తుగా వరదొచ్చింది. ఎందరో నీటిలో మునిగిపోతున్నారు. అంతలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం రంగంలోకి దిగింది. లైఫ్ జాకెట్లు వేసుకుని, బోట్లలో నీళ్లలోకి వెళ్లారు. మునిగిపోతున్న వారిని కాపాడి.. ఒడ్డుకు చేర్చారు. సీపీఆర్ చేశారు. ప్రాణాలను కాపాడారు. ఇదంతా సూళ్లూరుపేట మండలం కోటపోలూరు పెద్దన్న చెరువులో గురువారం మాక్‌డ్రిల్. వరదలు, విపత్తులు సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? నీటిలో చిక్కుకొన్న వారిని ఎలా రక్షించాలి? లైఫ్ జాకెట్లు వేసుకుంటే నీటిలో ఎంతవరకు ఉండొచ్చు.. వంటి అంశాలపై ఎన్‌డీఆర్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సుమన్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ ద్వారా ప్రజలకు, అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఎస్‌వీ నరసింహారావు, సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు, ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్, కోటపోలూరు సర్పంచ్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి



కాపాడిన వారిని బయటకు తీసుకొస్తున్న సిబ్బంది



మాక్ డ్రిల్‌లో పాల్గొన్న వారు

పల్లెపల్లెనా బెల్టు షాపుల జోరు

పగలు రూ.10 నుంచీ రూ.20 అదనం

రాత్రిళ్లు రూ.30 నుంచీ 150 దాకా అధికం

తెగ తాగిస్తున్నారు!

- మద్యం షాపులకు అనుబంధంగా అనధికారిక గదులు



మద్యం అక్రమ వ్యాపారానికి 'బార్లు' తెరిచారు. దుకాణాల పక్కనే అనధికార గదులు.. పల్లెల్లో బెల్టు షాపులు పెట్టి తెగ తాగిస్తున్నారు. కొన్ని చోట్ల మందు బాబుల సిట్టింగ్‌కు సదుపాయాలు కల్పించారు. మరికొన్నింటికి కూల్ డ్రింక్ షాపుల పేరిట బోర్డులు పెట్టి లోపల మద్యం తాగిస్తున్నారు. బెల్టు షాపుల్లో టైమింగ్‌ను బట్టి అదనపు ధరలు మారుతుంటాయి. ఎక్సైజ్, పోలీసు శాఖలు స్పందించకపోవడంతో నామమాత్రపు కేసులకే పరిమితమవుతున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతి: పోటాపోటీగా అనుబంధ గదులు

తిరుపతిలో 24 మద్యం షాపులకు అనుబంధంగా మందుబాబులు తాగేందుకు గదులు ఏర్పాటయ్యాయి. వీటికి తోడు 18 బెల్టు షాపులున్నాయి. రూరల్‌లో 12 మద్యం షాపులకూ సమీపాల్లో తాగేందుకు గదులు ఏర్పాటు చేశారు. పక్కనే కూల్ డ్రింకు షాపుల్లోనూ తాగిస్తున్నారు. రూరల్ మండలంలో 17 బెల్టు షాపులున్నట్టు అంచనా. పగలు క్వార్టర్‌పై రూ.10-20 వరకూ.. రాత్రి పది నుంచీ ఉదయం పది మధ్య బాటిల్‌పై రూ.30 నుంచీ రూ. 50 వరకూ రేటు పెంచి విక్రయిస్తున్నారు.

రేణిగుంట: రాత్రిళ్లు ధరల ఘాటు

రేణిగుంట మండలంలోని పది షాపుల్లో.. తొమ్మిదింటి వద్ద అనధికార గదుల్లో మద్య తాగిస్తున్నారు. రాత్రిళ్లు షాపులు మూతపడ్డాక మాత్రం అనధికారిక మద్యం అధిక ధరలతో ఘాటెక్కుతోంది. బాటిల్‌పై రూ. 50 నుంచీ రూ. 150 దాకా పెంచి విక్రయిస్తున్నారు. గ్రామాల్లో మద్యం విక్రయాలు జోరుగా నడుస్తున్నాయి. ఉదాహరణకు.. అక్రమంగా మద్యం విక్రయిస్తూ ఒకే మహిళ రెండు సార్లు గాజులమండ్యం పోలీసులకు పట్టుబడింది.

శ్రీకాళహస్తి: సకల సదుపాయాలు



శ్రీకాళహస్తి బస్టాండు ఎదురుగా మద్యం షాపు పక్కనే తాగించడానికి ఏర్పాట్లు

శ్రీకాళహస్తిలోనూ పదింటికి గాను 9 షాపుల పక్కనే అనుబంధ గదుల్లో మందుబాబులకు సకల సదుపాయాలు కల్పించారు. మరో షాపునకూ మరో నాలుగైదు రోజుల్లో అనధికార గదిని అందుబాటులోకి తెచ్చేలా సిద్ధం చేస్తున్నారు. దుకాణాలు మూసేశాక దొంగచాటు అమ్మకాలతో ధరలు పెంచుతున్నారు. స్థానికుల ఫిర్యాదుతో రెండు వారాల కిందట పానగల్ రైల్వే గేట్ సమీపంలో బెల్టు షాపుపై ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి కేసు నమోదు చేశారు.

నాగలాపురం: అనధికారిక బార్లు



నాగలాపురంలో బహిరంగంగానే అనధికార బార్లు

నాగలాపురంలో రెండు, సురుటిపల్లి, టీపీ కోటల్లో ఒక్కొక్కటి చొప్పున మండలంలో నాలుగు లైసెన్సుడ్ మద్యం షాపులున్నాయి. వాటి పక్కనే అనధికారికంగా బార్లు నడుస్తున్నాయి. బహిరంగంగానే వీటిని నిర్వహిస్తుండడం విశేషం. నందనం గ్రామంలోని బెల్టు షాపులో బాటిల్‌పై రూ. 50 ఎక్కువ ధరతో విక్రయిస్తున్నారు. ఈ షాపుపై పోలీసులు కేసు నమోదు చేసినా మళ్లీ వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు.

డక్కిలి: బారుల్లా కూల్ డ్రింక్ షాపులు



డక్కిలిలో వైన్‌షాపు పరిసరాల్లో కూల్‌డ్రింక్ షాపు వద్ద మద్యం తాగుతున్న మందుబాబులు

డక్కిలి, మోపూరు రోడ్డు, దగ్గవోలు గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున మూడు లైసెన్సుడ్ షాపులున్నాయి. డక్కిలి షాపు దగ్గరగా నాలుగైదు కూల్ డ్రింకు షాపులున్నాయి. మిగిలిన షాపుల పక్కనే ఒకటి రెండు చొప్పున కూల్ డ్రింకు షాపులు ఏర్పాటయ్యాయి. ఆ షాపుల్లోనే మందు బాబులు సిట్టింగ్ వేసి తాగుతున్నారు. దీని కోసం కూల్ డ్రింకు షాపు నిర్వాహకులు మద్యం షాపు వారికి రోజుకు రూ. వెయ్యి నుంచీ రూ. 1500 చెల్లించేలా ఒప్పందాలు చేసుకున్నట్టు ఆరోపణలున్నాయి. అంటే, మందుబాబులు తాగేందుకు వీరు 'ప్రత్యేక ఛార్జీ' వసూలు చేస్తున్నారు. ఇక, బెల్టుషాపుల్లో బాటిల్‌పై పగలు రూ.20-30.. రాత్రిళ్ల రూ.50 ఎక్కువ ధరతో అమ్ముతున్నారు.

బెల్టుషాపులకు 'కోట' జిల్లాలోనే అత్యధికంగా బెల్టు షాపులు కోట మండలంలో ఉన్నాయి. ఏడు లైసెన్స్‌డ్ షాపుల్లో.. కొన్నింటి పక్కన మద్యం తాగేందుకు గదులు ఏర్పాటయ్యాయి. ఇక, 21 పంచాయతీల పరిధిలో 150 దాకా బెల్టు షాపులున్నాయి. వీటిల్లో బాటిల్‌పై రూ.50 నుంచీ రూ. 70 చొప్పున అధిక ధరతో విక్రయిస్తున్నారు. అయినా ఎక్సైజ్, పోలీసు దాడులు, తనిఖీలు లేవిక్కడ.

ఎక్సైజ్ గుర్తించిన బెల్టు షాపులే 930

జిల్లాలో 227 లైసెన్సుడ్ మద్యం షాపులున్నాయి. వీటిలో 182 దుకాణాలకు అనుబంధంగా గదులున్నట్టు అంచనా. ఇక, 930 బెల్టు షాపులున్నాయని ఎక్సైజ్ అధికారులు గుర్తించినట్టు సమాచారం. బెల్టు షాపుల నిర్వాహకులు మద్యం దుకాణాల నుంచే కాకుండా తమిళనాడు నుంచీ చీప్ లిక్కర్ తెచ్చి అమ్ముతున్నారనే ఆరోపణలున్నాయి. గత 15 రోజుల వ్యవధిలో ఎక్సైజ్ అధికారులు 35 కేసులు నమోదు చేసి 52 మందిని అరెస్టు చేయడంతో పాటు 430 క్వార్టర్ బాటిళ్లు సీజ్ చేశారు. దీన్నిబట్టి జిల్లాలో మద్యం అక్రమ వ్యాపారం ఏ స్థాయిలో జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు.

దొరవారిసత్రం: బెల్టుకు వేలం

దొరవారిసత్రం మండలంలో లైసెన్సుడ్ మద్యం దుకాణాలు రెండూ వైసీపీ అనుకూల వ్యక్తులకు దక్కాయి. అధికార పార్టీ నాయకులకు భయపడి వారు బెల్టు షాపుల జోలికి వెళ్లడం లేదు. దీన్ని అవకాశంగా తీసుకుని అధికార పార్టీ నాయకులు కొందరు బెల్టు షాపులు ఏర్పాటు చేశారు. ఈ షాపులకు సూళ్లూరుపేటలో టీడీపీ కీలక నేత పరిధిలోని నాలుగు దుకాణాల నుంచి మద్యం సరఫరా చేస్తున్నారు. ఇటీవల శ్రీధనపల్లిలో బెల్టు షాపు నిర్వహణకు ఏకంగా వేలం పాటలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆ వేలంలో ఓ వ్యక్తి రూ. 1.60 లక్షలకు షాపు దక్కించుకోవడంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో ఎక్సైజ్, పోలీసు యంత్రాంగాలు రంగంలోకి దిగి విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. దీంతో బెల్టు షాపులకు మద్యం సరఫరా తాత్కాలికంగా ఆగింది. వేడి తగ్గగానే 45 బెల్టు షాపుల ఏర్పాటుకు సన్నద్ధమవుతున్నారు.

అన్ని చోట్లా ఇలానే..

- చంద్రగిరి మండలంలో 7 మద్యం షాపులుంటే 16 మంది అధికార పార్టీ నాయకులు సిండికేట్‌గా ఏర్పడి ఒక షాపు నిర్వహణ తీసుకున్నారు. వారే బెల్టు షాపులకు తెర లేపారని సమాచారం. మండలాన్ని రెండుగా విభజించి ఒక్కో ప్రాంతానికి ఇద్దరేసి నాయకులు బెల్టు షాపుల దందా నడిపిస్తున్నారని ఆరోపణలున్నాయి. చంద్రగిరిలో ఓ షాపు పక్కనే అనుబంధ గది ఏర్పాటు చేయగా, పోలీసులు తనిఖీ చేసి హెచ్చరించారు. కొన్ని చోట్ల షాపుల కోసం గదులు అద్దెకు ఇచ్చిన యజమానులే వాటి పక్కన కూల్ డ్రింక్ షాపులు ఏర్పాటు చేసుకుంటున్నారు. మద్యం షాపులో కంటే బాటిల్‌పై రూ.10, రూ. 20 అదనపు ధరతో విక్రయిస్తున్నారు. మండలంలో 20 బెల్టు షాపులున్నాయని అంచనా.
- పాకాలలో ఐదు షాపులుంటే 27 మంది రాజకీయ నాయకులు సిండికేట్‌గా ఏర్పడ్డారు. మండలంలో పదిహేను వరకూ బెల్టు షాపులున్నాయి. క్వార్టర్ మీద రూ. 10 నుంచీ రూ. 15 వరకూ అదనం.
- చిన్నగొట్టిగల్లు మండలంలో మూడు వైన్ షాపులున్నాయి. ఈ షాపుల్లో మద్యం కొని కొందరు బాటిల్‌పై రూ. 20 నుంచీ రూ. 50 దాకా ధర పెంచి గ్రామాల్లో అమ్మకాలు సాగిస్తున్నారు. 13 గ్రామాల్లో ఇలాంటి ఏర్పాట్లున్నాయి.
- నాయుడుపేట మండలంలో 13 షాపుల పక్కనా అనధికారిక గదులు ఏర్పాటయ్యాయి. గ్రామాల్లో 20 బెల్టు షాపులున్నట్టు అంచనా. వీటిల్లో బాటిల్‌పై రూ.30 నుంచీ రూ. 50 వరకూ ధరలు పెంచి అమ్ముతున్నారు. బెల్టు షాపుల ఏర్పాటు వెనుక నాయకుల ప్రమేయం ఉంది.
- పెళ్లకూరు మండలంలో రెండు షాపులున్నాయి. ఇక, బెల్టు షాపులపై స్థానికుల ఫిర్యాదుతో తాళ్వాయిపాడు గ్రామంలో ఎక్సైజ్, పోలీసు అధికారులు తనిఖీలు చేసి ఇద్దరు మహిళలను అరెస్టు చేశారు. వారి నుంచీ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.
- గూడూరులో 12 షాపులున్నాయి. వీటిల్లో పలువురు మద్యం కొని.. గ్రామాల్లో బాటిల్‌పై రూ.50 పెంచి విక్రయిస్తున్నారు. ఇలాంటి వారిపై ఎక్సైజ్ పోలీసులు ఐదు కేసులు నమోదు చేశారు. పట్టణంలోని మూడు షాపుల వద్ద మాత్రం పక్కనే కూల్ డ్రింకు షాపులు వెలిశాయి. వాటిలో మద్యం విక్రయిస్తున్నారు.
- వాకాడు మండలంలో నాలుగు మద్యం దుకాణాల పక్కనా కూల్ డ్రింకు షాపులు పెట్టారు. గ్రామానికి రెండు మూడు బెల్టు షాపులు ఏర్పాటయ్యాయి. మద్యం షాపులన్నీ సిండికేట్‌గా మారాయని, నిర్వాహకులే బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. బెల్టు షాపుల్లో ఎమ్మార్పీ కంటే రూ.50-80 అదనంగా విక్రయిస్తున్నారు.
- చిల్లకూరు మండలంలోని 6 షాపుల పక్కనా అనధికారిక షాపులు ఏర్పాటయ్యాయి. బాటిల్‌పై రూ. 50 పెంచి అమ్మేస్తున్నారు.
- చిట్టమూరు మండలంలో నాలుగు దుకాణాల పరిధిలోని గ్రామాల్లోనూ బెల్టు షాపులు నడుస్తున్నాయి. బాటిల్‌పై రూ. 50 ఎక్కువ ధరకు అమ్ముతున్నారు.
- బాలాయపల్లి మండలంలో మూడు మద్యం షాపుల పక్కనా అనధికారిక బార్ రూమ్‌లు వెలిశాయి. ప్రతి గ్రామంలో రెండు చొప్పున బెల్టు షాపులు ఏర్పాటయ్యాయి.
- వెంకటగిరిలో తొమ్మిది షాపుల పక్కనే ఒక్కో కూల్ డ్రింక్ షాపు కొలువు దీరాయి. వీటిల్లోనే మందు బాబులు మద్యం తాగుతున్నారు. గ్రామాల్లో బెల్టు షాపులు సరేసరి. ఇటీవలే ముదంపల్లిలో బెల్టు షాపును గుర్తించి ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదుచేశారు.
- పుత్తూరులో ఏడు షాపుల వెనుక మద్యం తాగేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఓ వైసీపీ నాయకుడు విచ్చలవిడిగా బెల్టు షాపులు నడుపుతుండగా.. అతడికి అధికార పార్టీ నాయకులు సహకరిస్తున్నట్టు ఆరోపణలున్నాయి.

బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో ఐదు లైసెన్సుడ్ షాపుల పక్కన అనధికారిక గదుల్లో మద్యపానం నడుస్తోంది. 15 గ్రామాల్లో బెల్టు షాపులుండగా, అధిక రేట్లకు విక్రయిస్తున్నారు.



బుచ్చినాయుడు కండ్రిగలో వైన్‌షాపు పక్కనే తాగడానికి ఏర్పాట్లు

కేవీబీపురం మద్యం దుకాణం వెనుకవైపు ఎంచక్కా పందిరి వేసి, టేబుళ్ల తరహాలో బండలు అమర్చి మద్యం తాగడానికి ఏర్పాటు చేశారు.



కేవీబీపురంలో వైన్‌షాపు పక్కన ఖాళీ స్థలంలో మందు బాబుల కోసం బండలతో టేబుళ్ల తరహాలో వేశారిలా

రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగి మృతి



శ్రీకాళహస్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో రాజ్‌కుమార్(30) అనే సచివాలయ ఉద్యోగి మృతి చెందారు. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్ తెలిపిన ప్రకారం.. రేణిగుంటకు చెందిన రాజ్‌కుమార్ శ్రీకాళహస్తి మండలం కాపుగున్నేరి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని నాయుడుపేట-తిరుపతి జాతీయ రహదారి దాటి అవతలి వైపు వెళుతుండగా తిరుపతి నుంచి నాయుడుపేట వైపుగా వెళుతున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాజ్‌కుమార్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం కరకంబాడి వద్ద ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూరాజ్‌కుమార్ అక్కడ మృతి చెందారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ ప్రమాణస్వీకారం

అమరావతి,నవంబరు21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్‌గా శుక్రవారం ఉదయం 11.30 గంటలకు ప్రమాణస్వీకారం చేయనున్నట్లు టీడీపీ నేత నీలాయపాలెం విజయ్‌కుమార్ తెలిపారు. నాగార్జున వర్సిటీ వద్ద రెయిన్‌ట్రీ పార్కులోని బోర్డు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరగనుంది.

బీర్ల లారీ బోల్తా

బీర్ల లారీ బోల్తాపడిన ఘటన ఘటనలో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. పాండిచ్చేరి నుంచి 1800 కేసుల బీరు బాటిళ్ల లోడుతో వైజాగ్‌కు ఓ లారీ బుధవారం బయలుదేరింది. గురువారం తెల్లవారుజామున తడ మండలం అక్కంపేట సమీపంలోకి వచ్చేసరికి వేగంగా వెళ్తున్న లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన గుంతలో బోల్తాపడింది. డ్రైవర్ కన్నన్‌సేతుకు తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది సురేష్, కోటేశ్వరరావు ఘటనాస్థలానికి చేరుకొని డ్రైవర్‌ను సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లారీలో ఉన్న బీరు కేసులన్నీ చాలా వరకు దెబ్బతిన్నాయి. బీర్ల లారీ బోల్తా పడిందని తెలిసి చుట్టుపక్కల వాళ్లు ఘటనాస్థలానికి చేరుకున్నారు. అప్పటికే పోలీసులు అక్కడకు చేరుకొని వారిని తరిమేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, లారీని ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు.

- తడ, ఆంధ్రజ్యోతి



ఆర్ఆర్‌బీ పరీక్షలకు ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), నవంబరు21 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో జరుగనున్న ఆర్ఆర్‌బీ అర్హత పరీక్షల అభ్యర్థుల కోసం ఈనెల 23 నుంచి 29వ తేదీ వరకు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు సీపీఆర్‌వో శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు-సికింద్రాబాదు, కరీమ్‌నగర్-కాచిగూడ, కాచిగూడ-కర్నూలు సిటీ, హుబ్లీ-కర్నూలు సిటీ, నాందేడ్-తిరుపతి, కాకినాడ టౌన్-తిరుపతి మధ్య రైళ్లు నడుపుతామని తెలిపారు.

- నాందేడ్-తిరుపతి మధ్య 23న ప్రత్యేక రైలు(07105) నాందేడ్‌లో మధ్యాహ్నం 12.25 గంటలకు బయలుదేరి ముడికేడ్, ధర్మాబాదు, నిజామాబాద్, కామారెడ్డి, కాచిగూడ, మహబూబ్‌నగర్, గద్వాల్, కర్నూల్‌సిటీ, డోన్, అనంతపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లె రోడ్డు, పాకాల స్టేషన్ల మీదుగా మరుసటి రోజు ఉదయం 6.25 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది.
- తిరుపతిలో ప్రత్యేక రైలు (07106) 24వ తేదీ మధ్యాహ్నం 3.35 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలోనే ప్రయాణిస్తూ మరుసటి రోజు 8.35 గంటలకు నాందేడ్ చేరుకుంటుంది.
- కాకినాడటౌన్‌లో 23వ తేదీ ప్రత్యేక రైలు(07107) ఉదయం 6.30 గంటలకు బయలుదేరి సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, న్యూగుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, బిట్రగుంట, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా అదే రోజు సాయంత్రం 6.15 గంటలకు తిరుపతి చేరుకుంటుంది.
- తిరుపతిలో 24వ తేదీ ప్రత్యేక రైలు(07108) రాత్రి 7.45 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ మరుసటి రోజు ఉదయం 9.45 గంటలకు కాకినాడటౌన్‌కు చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు ఈనెల 23, 24 తేదీలతో పాటు 26, 28, 29 తేదీలలో రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు.

రూ.300 దర్శన టికెట్లు 25న విడుదల

తిరుమల, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి నెలకు సంబంధించిన తిరుమల శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను టీటీడీ ఈనెల 25వ తేదీన విడుదల చేయనుంది. ఉదయం 10 గంటలకు ఈ కోటాను టీటీడీ అధికారిక వెబ్‌సైట్ 'టీటీడీదేవస్థానమ్స్.ఏపీ.జీవోవీ.ఇన్' ద్వారా విడుదల చేస్తారు.అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలోని టీటీడీ వసతి సముదాయాల్లో ఖాళీలను కూడా విడుదల చేస్తారు. మరోవైపు 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ, 11 గంటలకు శ్రీవాణిట్రస్టు టికెట్లు జారీ చేయనున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.08 కోట్లు

తిరుమల, నవంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.08 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈ వివరాలను టీటీడీ గురువారం ఉదయం ప్రకటించింది. బుధవారం 59,231 మంది శ్రీవారిని దర్శించుకున్నారు.

సైబర్ ఉచ్చులో ఎరువుల వ్యాపారి

- నిమిషాల వ్యవధిలో రూ 13.5 లక్షలు పోగొట్టుకున్న వైనం

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సైబర్ ఉచ్చులో పడి తిరుపతికి చెందిన ఓ ఎరువుల వ్యాపారి రూ.13.5 లక్షలు పోగొట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటకు చెందిన ఎరువుల వ్యాపారి (మార్కెటింగ్) జయరామిరెడ్డికి తిరుపతిలో ఐసీఐసీఐ బ్యాంకులో ఖాతా ఉంది. అకౌంటు వుంది. ఈయన ప్రమేయం లేకుండానే 'వీఐపీ ఈ7 ఇన్వెస్ట్‌మెంట్ అలియన్స్ లెర్నింగ్' వాట్సాప్ గ్రూప్‌లో యాడ్ అయ్యారు. ఈ గ్రూప్‌లో వచ్చిన ఏపీకే ఫైల్‌ను డౌన్‌లోడ్ చేశారు. అప్పుడు ఆయన మొబైల్‌లో ఫేక్ 'సీడబ్ల్యూఏ మ్యానేజ్' యాప్ కూడా డౌన్‌లోడ్ అయింది. అందులో ఆన్‌లైన్ స్టాక్ ట్రేడింగ్ చేశారు. అనంతరం అతడి ఖాతాలో రూ.24.3 లక్షలు కనిపించాయి. ఆ మొత్తాన్ని విత్‌డ్రా చేయబోగా యాప్ కనిపించకుండా పోయింది. తాను మోసపోయాయని తెలుసుకున్న ఆయన.. రూ.13.5 లక్షలు నష్టపోయినట్లు తిరుపతి రూరల్ పోలీసు స్టేషనులో గురువారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ చిన్నగోవిందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట, నేలకూలిన కొబ్బరిచెట్లు

వీడని గజ దాడులు

ముప్పిరెడ్డిగారిపల్లి వద్ద పంటలతో పాటు వరికోత యంత్రం ధ్వంసం

కల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం రెడ్డివారిపల్లి పంచాయతీ ముప్పిరెడ్డిగారిపల్లి వద్ద బుధవారం రాత్రి ఏనుగుల గుంపు పంటలను, వరికోత యంత్రాన్ని ధ్వంసం చేశాయి. చిన్నగొట్టిగల్లు మండలంలో బుధవారం పగలంతా తిష్టవేసిన 16ఏనుగులు గుంపు సాయంత్రం చీకటిపడే సమయానికి పులిచెర్ల మండలంలోకి చేరుకున్నాయి. రెడ్డివారిపల్లి పంచాయతీ ముప్పిరెడ్డిగారిపల్లి వద్దకు చేరుకున్న ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడం ప్రారంభించాయి. చిచ్చిలివారిపల్లికి చెందిన రామమూర్తి, బాలకృష్ణకు వరి పంటలను, అరటిచెట్లు, కొబ్బరిచెట్లను ధ్వంసం చేశాయి. ముప్పిరెడ్డిగారిపల్లిలో రెడ్డిబాషా, అంజనేయులుకు చెందిన వరి పంట, వంకాయపంట, ప్రకాష్‌రెడ్డికి చెందిన కొబ్బరిచెట్లను ధ్వంసం చేశాయి. నలుగురు రైతులకు చెందిన బోరు మోటర్లను ధ్వంసం చేసిన ఏనుగులు డ్రిప్ పైపులను తొక్కేశాయి. తమిళనాడు నుంచి వరికోతల కోసం వచ్చిన వరికోత యంత్రాన్ని ధ్వంసం చేశాయి. ఏనుగుల గుంపు అక్కడి నుంచి సమీపంలోని మూలమడుగు అడవివైపు పయనించాయి. గురువారం రాత్రికి మంగళంపేట వైపు వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

ఏనుగుల సమస్య పరిష్కరించండి

అసెంబ్లీలో అమర్ విజ్ఞప్తి



పలమనేరు, నవంబరు21 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ప్రాంతంలో ఏనుగుల సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి గురువారం అసెంబ్లీలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నెలరోజుల వ్యవధిలో ఇద్దరు ఏనుగుల బారిన పడి చనిపోయారని, కోట్లాది రూపాయల పంట నష్టం జరుగుతోందన్నారు. ఏనుగుల సమస్య పరిష్కారం కోసం కుంకీ ఏనుగులను తీసుకువస్తున్నారని, దీంతో మదమెక్కిన ఏనుగులను కుంకీ ఏనుగులు అదుపు చేస్తాయన్నారు. గతంలోనే 20 హెక్టార్ల స్థలాన్ని కుంకీ ఏనుగుల కోసం కేటాయించారని, కుంకీ ఏనుగుల సంరక్షణ, తదితరాలకు నిధుల సమస్య కూడా లేదన్నారు. ఏనుగులను కట్టడి చేసి రైతుల ప్రాణ నష్టాన్ని, పంట నష్టాలను కాపాడాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పెద్దిరెడ్డి వ్యూహం ఏంటి?

● అసెంబ్లీలో బలం లేకున్నా..
పీఏసీ సభ్యత్వం కోసం నామినేషన్
● ఆశ్చర్యపోతున్న జిల్లా రాజకీయ నాయకులు



చిత్తూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) సభ్యత్వం పదవి కోసం జిల్లాకు చెందిన వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం అసెంబ్లీకి వెళ్లి నామినేషన్ వేశారు. సాధారణంగా పీఏసీ ఛైర్మన్ పదవిని ప్రతిపక్షాలకు కేటాయిస్తుంటారు. గత ప్రభుత్వంలో టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పనిచేశారు. తొలుత పీఏసీ మెంబర్‌గా నామినేషన్ వేసి, కనీసం 20మంది ఎమ్మెల్యేలు ఓటేస్తే మెంబర్‌గా గెలుస్తారు. గతంలో టీడీపీ నుంచి 23మంది ఎమ్మెల్యేల మద్దతుండడంతో పయ్యావుల కేశవ్ మెంబర్‌గా గెలిచి, ఛైర్మన్ అయ్యారు. ఇప్పుడు వైసీపీకి ఉండేది 11 మంది ఎమ్మెల్యేలు మాత్రమే. ఒకవేళ పోలింగ్ జరిగినా.. సంఖ్యాబలం లేకపోవడంతో ఓడిపోతారు.ఇది తెలిసీ సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి అయిన పెద్దిరెడ్డి గురువారం నామినేషన్ వేయడంపై జిల్లా రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కూటమి పార్టీలు ఆ పదవికి జనసేన ఎమ్మెల్యే పులవర్తి రామాంజనేయులును ఎంపిక చేశారని తెలిసీ సీనియర్ నాయకుడు పెద్దిరెడ్డి నామినేషన్ వేయడంతో రాజకీయ వర్గాలు ఆశ్చర్యపోతున్నాయి.ఈ విషయంలో వైసీపీ వ్యూహమేంటో అన్న చర్చ నడుస్తోంది.

వీఆర్‌ఏల సంఘం జిల్లా కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

చిత్తూరు అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ) సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం స్థానిక రెవెన్యూ అసోసియేషన్ భవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా టి.కోదండన్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.దేవరాజు, సహాధ్యక్షుడిగా ఎస్.ఇర్ఫాన్ అలీ, గౌరవ అధ్యక్షుడిగా వై.లక్ష్మణ్‌లను ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా యాగమూర్తి, జయ బదూరి, మంజుల, మాధవి, వాణి, కోశాధికారిగా అశోక్, జాయింట్ సెక్రటరీలుగా డిల్లిజా, సుదర్శినీ, వినాయక, సుమంత్, ఖాదర్ బాషా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా లోకనాథం, ఆనంద్, రాజేష్, ప్రకాష్, నరేష్, రూబిని, మాధవి, దయాకర్, రాధమ్మలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల రాష్ట్ర అధ్యక్షుడు గరికపాటి బ్రహ్మయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సతీష్, జాయింట్ సెక్రటరీ రాఘవేంద్ర, వెంకటరమణలతో పాటు రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఏపీజేఏసీ అమరావతి సంఘాల నేతలు కూడా పాల్గొన్నారు.

నేటినుంచి అరగొండలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

తవణంపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె మండలంలోని అరగొండలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నుంచి ఈనెల 24వ తేదీవరకు అండర్-14 రాష్ట్రస్థాయి బాల, బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు టోర్నమెంట్ నిర్వాహక కార్యదర్శి కృష్ణ తెలిపారు. ఈ పోటీలను కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ, డీఈవో వరలక్ష్మి ప్రారంభిస్తారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 13 ఉమ్మడి జిల్లాల నుంచి బాల, బాలికలు పాల్గొంటారన్నారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు.

ఇసుక టిప్పర్‌కు రూ.లక్ష జరిమానా



స్వాధీనం చేసుకున్న టిప్పర్

విజయపురం,నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇసుక టిప్పర్ సీజ్ చేసి రూ.లక్ష జరిమానా విధించిన సంఘటన విజయపురంలో జరిగింది. కేవీపురం కుశస్థలి నది నుంచి టీఎన్18బీఎం 1548 నెంబరు గల టిప్పరులో తమిళనాడుకు చెందిన వ్యక్తి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా గురువారం ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో ఎస్‌ఐ బలరాం సీజ్ చేశారు. వాహన యజమానికి రూ.లక్ష అపరాధం విధించినట్లు తహసీల్దార్ కిరణ్ తెలిపారు.

ఎన్నికల సంఘ ప్రతినిధి రాక

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం సెక్షన్ ఆఫీసర్ సీహెచ్ రవీందర్ కుమార్ గురు, శుక్రవారాల్లో జిల్లాలో పర్యటన నిమిత్తం వచ్చారు. గురువారం చిత్తూరు ఆర్డీవో కార్యాలయంతోపాటు నగరంలోని పలు పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల అధికారుల కార్యాలయాలను తనిఖీ చేశారు. శుక్రవారం పలమనేరు ఆర్డీవో కార్యాలయం, స్థానిక పోలింగ్ కేంద్రాలను పరిశీలించనున్నారు.

గంజాయి మొక్కల స్వాధీనం

గంగవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి మొక్కలతోపాటు ఒక కేజీ గంజాయిని స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్ట్ చేసినట్లు సీఐ ప్రసాద్ తెలిపారు. మండలంలోని సామరాజుపల్లె సమీపంలో గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం రావడంతో గురువారం తహసీల్దార్ శివకుమార్‌తో కలసి తనిఖీ చేశామన్నారు. హరికృష్ణ అనే వ్యక్తి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడడంతో అతడిని అరెస్టు చేసి అక్రమంగా సాగుచేస్తున్న 9గంజాయి మొక్కలను, ఒక కేజీ గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేశవులు అనే మరో వ్యక్తి పరారయ్యాడని, అతడిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు.

ఏపీలో క్రీడారంగం అభివృద్ధికి సహకరిస్తాం

తిరుపతి (క్రీడలు), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో క్రీడారంగం అభివృద్ధికి సహకరిస్తామని భారత యువజన వ్యవహారాలు, క్రీడా శాఖ సహాయమంత్రి రక్షానిఖిల్‌ఖడ్సే హామీ ఇచ్చారు. తిరుమల, తిరుపతి పర్యటనకు వచ్చిన ఆమెను శాప్ ఛైర్మన్ రవినాయుడు కలిశారు. కాకినాడ, అమరావతి ప్రాంతాల్లో నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(ఎన్ఎస్ఓఈ)ఏర్పాటు, తిరుపతిలో రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా రెసిడెన్షియల్ స్పోర్ట్స్ సెంటర్(క్రీడా వసతి సముదాయం)నిర్మాణం, ఏపీలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి సహకరించాలని, క్రీడాకారులకు రైల్వే టికెట్‌లో రాయితీకల్పించాలని కోరారు.ఆమె సానుకూలంగా స్పందించారు.

కిడ్నాప్ గ్యాంగ్ అరెస్ట్



అరెస్టు చేసిన నిందితులతో డీఎస్పీ, రూరల్ సీఐ తదితరులు

కుప్పం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో ఇటీవల కలకలం సృష్టించిన కిడ్నాప్ ఘటనను పోలీసులు ఛేదించారు. ఏడుగురు కిడ్నాపర్లను అరెస్టు చేసి వారినుంచి వాహనం స్వాధీనం చేసుకున్నారు. పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్, కుప్పం రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్ కథనం మేరకు...రామకుప్పం మండలం పెద్దకురబలపల్లెకు చెందిన గోవిందప్ప, రఘురాం అన్నదమ్ములు. తమవద్ద రైస్ పుల్లింగ్ ద్వారా సంపాదించిన రూ.100కోట్లు ఉన్నాయని, బెంగళూరులో కొందరి వద్ద రఘురాం చెప్పారు. దీంతో బెంగళూరుకే చెందిన స్వర్ణలత, నవీన్, రామకుప్పం మండలం జౌకుపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం వారిని సంప్రదించారు. రూ.2000 నోట్లు మార్చి ఇస్తామని, తమకు 50 శాతం కమీషన్ ఇస్తామని గోవిందప్ప, రఘురాంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే తర్వాత కమీషన్ విషయంలో ఇరువర్గాలకూ విభేదాలు తలెత్తాయి. దీంతో స్వర్ణలత వర్గం ఆగ్రహించింది. గోవిందప్ప, రఘురాంలనుంచి రూ.100 కోట్లు ఎలాగైనా తెచ్చివ్వాలని తిరుపతికి చెందిన అరుణ్‌కుమార్‌తో డీల్ కుదుర్చుకుని రూ.కోటి రూపాయలు సుపారీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఈనెల 14వ తేదీ అర్ధరాత్రి గోవిందప్పతోపాటు ఆయన భార్య మాధవమ్మ, తల్లిదండ్రులు సిద్దప్ప, గంగమ్మ, పెద్దమ్మ సుబ్బమ్మ, కుమారుడు పునీత్‌కుమార్, తమ్ముడి కుమారుడు సోమశేఖర్‌లను గుర్తుతెలియని వ్యక్తులు వాహనాల్లో వచ్చి కిడ్నాప్ చేశారు. ఐటీ అధికారులమని చెప్పి ఆదాయానికి మించిన ఆస్తులున్నాయని, విచారించాలని చెప్పి తీసుకెళ్లారు. అయితే మధ్యలో కొంతమంది అడ్డురావడంతో వారిని మార్గమధ్యంలో వదిలేశారు. ఈ కిడ్నాప్ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.గురువారం అనుమానాస్పద స్థితిలో రామకుప్పం మండలం బందార్లపల్లె కూడలిలో సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను, అన్నవరం కూడలిలో నలుగురు వ్యక్తులను వాహనంతో సహా అరెస్టు చేశారు. వీరిని విచారించగా కిడ్నాప్ కేసులో నిందితులుగా తేలింది.రామకుప్పం మండలం జవుకుపల్లెకు చెందిన టీకే.సుబ్రహ్మణ్యం(39), బెంగళూరుకు చెందిన నవీన్‌కుమార్(39), పులిచెర్ల మండలం కమ్మపల్లెకు చెందిన అరుణ్‌కుమార్ (31), కడప జిల్లా ఎర్రగుంట్లకు చెందిన వరప్రసాద్(50), షేక్ ఖాదర్‌బాషా(33), పఠాన్ మదర్‌వలీలను అరెస్టు చేసి, వారు ఉపయోగించిన మూడు వాహనాలను సీజ్ చేశారు. వీరిలో చివరి ముగ్గురిపై కడప జిల్లా సంబేపల్లె పోలీసుస్టేషన్‌లో పలు కేసులున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో మొత్తం 12మంది భాగస్వాములయ్యారని, మిగిలిన ఐదుగురిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు.రామకుప్పం, రాళ్లబూదుగూరు, గుడుపల్లె ఎస్‌ఐలు వెంకటమోహన్, నరేశ్, శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డికి కుటుంబ బంధాలపై మాట్లాడే అర్హతలేదు : టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చిత్తూరు సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ రెడ్డికి కుటుంబ బంధాలపై మాట్లాడే అర్హత లేదని టీడీపీ నేతలు అన్నారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. జగన్ రెడ్డి అబద్ధాలు, అసత్యాల ఎపిసోడ్-4లో సీఎం చంద్రబాబు నాయుడు తల్లిదండ్రులు, వారి అనుబంధాలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆయన వ్యాఖ్యలను సుమోటోగా తీసుకుని పోలీసులు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా వేదికగా రాజకీయ ప్రముఖులు, న్యాయమూర్తులు, మహిళలపై అసభ్యకరంగా, కించపరిచేలా పోస్టులు పెడుతున్న వైసీపీకి చెందిన సైకోలపై కూటమి ప్రభుత్వం కేసులు పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ నేపథ్యంలో మాజీ సీఎం మానసిక స్థితిపై వైద్యపరీక్షలు చేయాలని ప్రజలు చర్చించుకుంటున్నారని తెలిపారు. తండ్రి పదవిని అడ్డుపెట్టుకుని వేల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసిన జగన్ రెడ్డిని ఈడీ, అవినీతి కేసులు వెంటాడటం, సుప్రీంకోర్టు అయితే వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని చెప్పారు. తన తల్లి, చెల్లి తమకు జరిగిన అన్యాయాన్ని మీడియా ద్వారా ప్రజలకు తెలియజేసిన విషయాలను ఆయన మరచిపోయారా అని ప్రశ్నించారు. ఇకనైనా జగన్ బుద్ధి తెచ్చుకోవాలని ఆ వేంకటేశ్వర స్వామిని ప్రార్థిస్తున్నామన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధులు సురేంద్ర కుమార్, సప్తగిరి ప్రసాద్, చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, పార్టీ కార్యాలయ కార్యదర్శి కోదండయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులుంటే కఠిన చర్యలు

ఎక్సైజ్ డీసీ విజయశేఖర్



కార్వేటినగరంలో సూచనలిస్తున్న ఎక్సైజ్ డీసీ విజయశేఖర్

వెదురుకుప్పం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ (డీసీ) విజయశేఖర్ హెచ్చరించారు. గురువారం కార్వేటినగరం ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. మద్యం దుకాణాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయాలు జరగాలన్నారు. ఎక్కువ ధరలకు విక్రయిస్తే దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. అలాగే సారా తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. దీనిపై తమకు సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

గంజాయి నిర్మూలనకు పటిష్ఠ చర్యలు

గంజాయి నిర్మూలనకు పటిష్ఠ చర్యలు తీసుకుంటునామని ఎక్సైజ్ డీసీ అన్నారు. మీడియాతో మాట్లాడుతూ.. గంజాయి అమ్మకాల్లో అనుమానిత పాత నేరస్తులను 14 మందిని బైండోవర్ చేశామని చెప్పారు. తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో విస్తృతంగా దాడులు జరిపిస్తామన్నారు. త్వరలోనే తమిళనాడు డీసీతో కూడా చర్చించి సంయుక్తంగా దాడులు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్వేటినగరం ఎక్సైజ్ సర్కిల్ సీఐ శిరీషాదేవి, ఎస్‌ఐలు మోసెస్, శ్రావణ్‌తేజ్, సిబ్బంది పనితీరును ప్రశంసించారు. అసత్య కథనాలు ప్రచురించవద్దని మీడియా ప్రతినిధులను కోరారు.

ప్రజల్ని, ప్రకృతిని వంచించిన జగన్ ప్రభుత్వం

వంచన పుస్తకావిష్కరణలో ముఖ్యమంత్రి చంద్రబాబు



తిరుపతి(విశ్వవిద్యాలయాలు), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలతో పాటు ప్రకృతినీ గత వైసీపీ ప్రభుత్వం వంచించిందని, వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పూతలపట్టు నియోజకవర్గానికి చెందిన పరిశోధకుడు డాక్టర్ డి.ఉదయకుమార్ రచించిన వంచన పుస్తకాన్ని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సౌజన్యంతో కుప్పం తెలుగుదేశం పార్టీ ప్రచురించింది. ఈ పుస్తకాన్ని ముఖ్యమంత్రి గురువారం సాయంత్రం అసెంబ్లీలోని సీఎంవో కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని, ఆర్థిక విధ్వంసాన్ని, పాలనా వైఫల్యాలను, అణగారిన వర్గాలపై జరిగిన దౌర్జన్యాలను, మహిళలపై అమానుష దాడులను, భూకబ్జాలను వివరిస్తూ 54 పరిశోధనాత్మక శ్వేతపత్రాలుగా రచించి.. వంచన పేరుతో డాక్టర్ ఉదయ్ వెలువరించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్,ఎమ్మెల్యే మురళీమోహన్, అమరావతి పబ్లిషర్స్ అధినేత సూర్నేని మోహన్ నాయుడు, తెలుగుయువత ప్రధాన కార్యదర్శి రాగల ఆనందగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలగుంట చెరువును క్లోజ్ చేసేశారు



● అసెంబ్లీ వాయిస్

'తిరుపతిరూరల్ మండలంలోని దళవాయిపరిధిలోని చెరువు నిండాక పేరూరుకు.. అక్కడ్నుంచి తుమ్మలగుంట చెరువుకు.. అనంతరం అవిలాల, తిరుచానూరు చెరువులకు నీరు వెళ్తుంది. అటువంటి తుమ్మలగుంట చెరువును సుందరీకరణ పేరుతో గత చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి సుమారు రూ.60కోట్ల తుడా నిధులు మళ్లించి ఖర్చు పెట్టారు. అభివృద్ధికి మేము అడ్డురాము. కానీ, తుమ్మలగుంట చెరువును క్లోజ్ చేయడంతో తాగునీరు సమస్య ఉంది. చెరువు పరిధిలో భవనాలు ఎక్కువ. ఈ చెరువు ఆయకట్టు సుమారు 118 ఎకరాల్లో ఉండగా.. చెరువు(ట్యాంక్) 143 ఎకరాలు. చెరువును క్లోజ్ చేయడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఎన్‌జీటీ రూల్స్ సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం ఎక్కడగానీ చెరువును మూయకూడదు. కానీ, తుమ్మలగుంట చెరువుకు నీళ్ల వచ్చే కాలువలను కాంక్రీట్ వేసి క్లోజ్ చేశారు. ఇప్పుడు మనిషిని పంపినా కూడా చూడొచ్చు. దానివల్ల వరదలు వచ్చినప్పుడు తిరుపతి పరిసరాలు మునిగిపోతున్నాయి' అంటూ చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అసెంబ్లీలో పేర్కొన్నారు.

దీనిపై మంత్రి నారాయణ స్పందిస్తూ.. 'చెరువు ఆయకట్టు 88.8 ఎకరాలు. ఇందులో 45ఎకరాల్లో గ్రావెల్‌తో లెవల్ చేసినమాట వాస్తవమే. దాంట్లో పార్కులు, ప్లేగ్రౌండ్స్ ఉన్నాయి. ఇక్కడ వాటర్ కంట్రోల్ చేసే గేటు కానీ, మిగులు నీళ్ల కిందకి పోయే నిర్మాణాన్ని, లోపల నీళ్లుండే ఏరియాని డిస్టర్బ్ చేయలేదు' అని పేర్కొన్నారు. దీనిపై నాని స్పందిస్తూ.. తుమ్మలగుంట చెరువుకు నీళ్ల వచ్చే కాలువలను కాంక్రీట్ వేసి క్లోజ్ చేశారని స్పష్టంచేశారు. ఇప్పుడైనా దానిని చూడొచ్చన్నారు. దీంతో వరదలు వచ్చినప్పుడు తిరుపతి పరిసరాలు మునిగిపోతున్నాయని గుర్తుచేశారు. 'సుప్రీంకోర్టు, ఎన్జీటీ ఆర్డర్ ప్రకారం కొన్ని పనులు చేయకూడదు. తుమ్మలగుంట చెరువులో అవి చేశారు. వాటిపై యాక్షన్ తీసుకుంటాం' అని మంత్రి నారాయణ అన్నారు.

- తిరుపతిరూరల్/చంద్రగిరి, ఆంధ్రజ్యోతి

అప్రైజర్ చేతివాటం

తక్కువ నాణ్యత గల బంగారు నగలతో రూ.40 లక్షల రుణం

యాదమరి యూబీఐలో వెలుగుచూసిన వైనం



యాదమరి యూనియన్ బ్యాంకు

యాదమరి,నవంబరు 21 (ఆంధ్రజోతి): యాదమరి మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా(యూబీఐ)లో అప్రైజర్ భాస్కరాచారి చేతివాటం చూపాడు. తక్కువ నాణ్యత గల బంగారు నగలను బినామీ పేర్లతో పెట్టి.. రూ.40లక్షల వరకు రుణాలు పొందాడు. గతవారం నుంచి బ్యాంకులో ఆడిటింగ్ జరుగుతుండటంతో అప్రైజర్ బాగోతం బయటపడింది. ఆయన్ను నిలదీయడంతో నగలు కుదువ పెట్టి తీసుకున్న రూ.40 లక్షల రుణాన్ని చెల్లించేశాడు. ఈక్రమంలో బ్యాంకు ఉన్నతాధికారుల నిర్ణయంతో అతడిపై ఎలాంటి కేసు నమోదు కాలేదు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీ

ఇదిలా ఉంటే.. రుణం చెల్లించినా తన నగలను ఇవ్వలేదని బ్యాంకు అధికారులను అప్రైజర్ నిలదీశాడు. ఆడిటింగ్ పూర్తి కాలేదని, తన ఖాలో ఉన్న నగలన్నింటినీ పరిశీలించాల్సి ఉందని బ్యాంకు అధికారులు స్పష్టం చేశారు. దీంతో ఈ వ్యవహారం కాస్తా గురువారం పోలీసు స్టేషన్‌కి చేరింది. బ్యాంకు అధికారులను, అప్రైజర్‌ను పోలీసులు పిలిపించి విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

స్టాఫ్‌నర్సు అదృశ్యం

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలో స్టాఫ్‌నర్సు అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరుపతి ఈస్ట్ ఎస్‌ఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా ఎస్ఆర్ పురానికి చెందిన 20 సంవత్సరాల యువతి ఆర్టీసీ బస్టాండుకు సమీపంలోని మారుతీ ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తోంది. తోటి నర్సులతో కలిసి ఆస్పత్రి సమీపంలో గది అద్దెకు తీసుకుని ఉంటోంది. రోజూ విధులు ముగిశాక తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడేది. కానీ బుధవారం ఫోన్ చేయలేదు. తల్లిదండ్రులు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. అనుమానం వచ్చి గురువారం ఆస్పత్రి వద్దకు వచ్చి విచారించారు. రెండు రోజులుగా డ్యూటీకి రావడం లేదని అక్కడి వారు చెప్పడంతో తండ్రి వెంకటేష్ తిరుపతి ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కడా కార్యాలయ నిర్మాణానికి రూ.2.60 కోట్లు

కుప్పం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కడా (కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) శాశ్వత భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.60 కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. 2024-2025 రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించిన ఈ నిధులకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ గురువారం విడుదల చేశారు. కుప్పంలోని ప్రభుత్వ కార్యాలయ భవన సముదాయంలో ప్రస్తుతం కడా కార్యాయం నడుస్తోంది. స్థలాన్ని సేకరించి, త్వరలోనే నిర్మాణం చేపట్టనున్నారు.

రేపు వారాహి యజ్ఞం

కుప్పం,నవంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు ఆదివారాహి శక్తి ఆలయట్రస్ట్ తరపున కుప్పం నియోజకవర్గంలో మొదటిసారిగా ఈనెల 23వ తేదీన మహా వారాహి యజ్ఞం నిర్వహించనున్నట్లు సాయిమాతా సేవాట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు జగదీశ్‌బాబు తెలిపారు. కుప్పంలోని శివశక్తి కళ్యాణ మడపంలో సాయంత్రం గంటలకు తమ ట్రస్టు తరపున యజ్ఞం నిర్వహిస్తామన్నారు. భక్తులు వారాహి యజ్ఞంలో పాల్గొని వారాహి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

టీడీపీ సభ్యత్వ నమోదులో కళ్యాణ్‌కు 16వ ర్యాంక్



చౌడేపల్లె, నవంబరు 21:(ఆంధ్రజ్యోతి) టీడీపీ సభ్యత్వ నమోదులో చౌడేపల్లెకు చెందిన రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి కళ్యాణ్‌కు రాష్ట్రంలో 16వ ర్యాంక్ వచ్చింది. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలో టీడీపీ సభ్యత్వాలను వేగవంతంగా నమోదు చేసినందుకు టీడీపీ డ్యాష్ బోర్డు ప్రకటించిన జాబితాలో తనకు 16 ర్యాంకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఆనంతరం ఆయన బత్తాలాపురంలో టీడీపీ సభ్యత్వాలు నమోదు చేయించారు.

ఇళ్ళు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలి

చౌడేపల్లె, నవంబరు21:(ఆంధ్రజ్యోతి)ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో ఇళ్ళు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని సీఐటీయూ నాయకులు వాడా గంగరాజు కోరారు. గురువారం ఆయన బోయకొండలో ఇళ్ళు కోల్పోయిన బాధితులతో సమావేశం నిర్వహించారు. అయన మాట్లాడుతూ. 50ఏళ్ల నుంచి బోయకొండలో వివిధ వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్న వారిని గత ప్రభుత్వ పెద్దలు 2019లో దౌర్జన్యంగా వారి షాపులు, ఇళ్లను తొలగించారన్నారు. ఆలయ అధికారులు, కలెక్టర్ స్పందించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చంద్ర, ఎల్లప్ప పాల్గొన్నారు.

అపార్ నమోదులో విద్యార్థుల ఇక్కట్లు

సోమల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అపార్ నమోదు విద్యార్థుల పాలిట శాపంగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. పలువురు సచివాలయ ఉద్యోగులు సెలవుపై వెళ్లడంతో విద్యార్థులు పడరానిపాట్లు పడుతున్నారు. నంజంపేట హైస్కూల్‌లో 230 మంది, ఎంపీపీ పాఠశాలలో 80 మంది విద్యార్థులు అపార్ నమోదుకు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ జిన్నా ఇటీవల జరిగిన మండల సమావేశంలో వాపోయారు. నంజంపేట సచివాలయంలో ఆధార్ నమోదుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో సింగిల్ విండో మాజీ డైరెక్టర్ మృతి



చిట్టిబాబు (ఫైల్ ఫొటో)

చౌడేపల్లె, నవంబరు21(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో సింగిల్ విండో మాజీ డైరెక్టర్ బాజిగం చిట్టిబాబు మృతి చెందాడు. మండలంలోని ఎ.కొత్తకోటకు చెందిన బాజిగం చిట్టిబాబు(40) బుధవారం రాత్రి కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా రాయలపాడ్‌లో బంధువుల పెళ్లికి ద్విచక్రవాహనంలో వెళ్లాడు. కళ్యాణ మండపం నుంచి కడప-బెంగళూరు ప్రధాన రోడ్డుకు ద్విచక్రవాహనంలో వచ్చాడు. ఈక్రమంలో బెంగళూరు నుంచి వస్తున్న బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. గాయపడ్డ ఆతడిని కోలార్ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు.

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు సోమల విద్యార్థులు



సోమల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు సోమల హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం హరినాథ్ తెలిపారు. గురువారం నెత్తకుప్పం హైస్కూల్‌లో జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో త్రోబాల్ అండర్-14 ఎంపిక పోటీలు స్కూల్ గేమ్స్ సెక్రటరీ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమల హైస్కూల్ కు చెందిన 9వ తరగతి విద్యార్థి అయ్యప్ప చరణ్ తేజ్, 8వ తరగతి విద్యార్థి అక్షర ప్రతిభ కనబరచి జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఈనెల 28, 29 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని పీడీ కరుణానిధి తెలిపారు.

గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం



పుంగనూరు రూరల్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాళ్యంపల్లెకు చెందిన గిరిజన కో ఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణానాయక్‌ను గురువారం టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన గిరిజన కులస్తులను గుర్తించి పదవి ఇచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవరెడ్డి, శ్రీకాంత్, సీవీరెడ్డి, సుహేల్‌బాషా, పోలీస్‌గిరి, శమీపతి, రాఘవ, రామకృష్ణానాయక్, కోలాట వెంకటరమణ, రమణ, చౌడప్ప, బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు నాణ్యతగా ఉండాలి

శాంతిపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సీసీ రోడ్ల నిర్మాణంలో క్వాలిటీ లేకపోతే బిల్లులు రావని ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ అన్నారు. గురువారం మెరసనపల్లె, కర్లగట్ట, రాళ్ళబూదుగూరు పంచాయతీలలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అలాగే కర్లగట్ట పంచాయతీ తమ్మిగానిపల్లె నుంచి కృషి విజ్ఞాన కేంద్రం వరకు వేస్తున్న తారు రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. కాంట్రాక్టర్లు పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మండలంలో 149 సీసీ రోడ్ల పనులు జరుగుతావున్నాయని, ప్రభుత్వం రూ.5.33 కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఏపీవో హరినాథ్, పంచాయతీ అధికారులున్నారు.

సోమలలో వీడని మంచు



సోమల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సోమలలో ఉదయం 8గంటలైనా మంచు తుంపర్లు పడుతుండడంతో ప్రజలు చలికి వణికిపోతున్నారు. ఉదయం వేళ వాహన ప్రయాణం గగనంగా మారుతోంది. వాహనదారులు ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించే లోపు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు

సదుం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని సదుం లయన్స్ క్లబ్ పర్యావరణ పరిరక్షణ డిస్ట్రిక్ కౌన్సిలర్, ఉన్నత పాఠశాల హెచ్ఎం లయన్ జయకుమార్ రెడ్డి పేర్కొన్నారు. లయన్స్ క్లబ్, సదుం ఉన్నత పాఠశాలల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఎన్‌జీసీ, ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి కొన్ని రకాల మొక్కల విత్తనాలు చెరుకువారిపల్లె అటవీ శివారు ప్రాంతాల్లో చల్లారు. సీడ్ బాల్స్ కూడా విత్తారు. విద్యార్థులకు అక్కడే వనభోజనాలు ఏర్పాటు చేశారు. పీజీటీలు రవీంద్ర బాబు, ఆంజనేయులు, ఉపాధ్యాయులు జిలానీ, బాషా, విశ్వనాథ్, యుగంధర్, అమరనాథరెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు నరసింహులు, రాజారెడ్డి, మనోజ్‌కుమార్ రెడ్డి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేపై గ్రామసభలు

రామకుప్పం, నవంబరు(ఆంధ్రజ్యోతి) : భూరీసర్వేపై రామకుప్పం పంచాయతీలో ఈనెల 23నుంచి 27వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. 23న తిమ్మసముద్రం, 26న చెన్నారెడ్డిపల్లి, 27న రామకుప్పంలో గ్రామసభలు జరుగుతాయని తెలిపారు. రీసర్వేకు సబంధించి భూసమస్యలు ఎదుర్కొంటున్న రైతులు గ్రామసభలకు హాజరై వినతిపత్రాలు సమర్పించాలని కోరారు.

వృద్ధులకు చలి దుస్తుల పంపిణీ

కుప్పం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణానికి చెందిన కొంతమంది యువకులు ఒక బృందంగా ఏర్పడి సామాజిక సేవ చేస్తున్నారు. చలి క్రమేణా విజృంభిస్తున్న వేళ రహదారి పక్కన అనాథలైన వృద్ధులు, వికలాంగులైన నిరుపేద పిల్లలు చలికి వణకడం వారి దృష్టికి వచ్చింది. దీంతో గురువారం సాయంత్రం అటువంటి వృద్ధులకు చలి కోట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజువేల్, మతిన్, పటేల్ బాబు, గని, సురేశ్, రవి, కలీం, లాలు, గురుస్వామి, ఫైరోజ్, ఇస్మాయిల్, నూర్, వినోద్, షబ్బీర్, బాబు, అజీమ్, కరీం, అస్గర్, ఏజస్, కృష్ణ ఆచారి, సంతోశ్, మన్సూర్, హేమంత్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు భూమి పూజ

శాంతిపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : శాంతిపురంలో గురువారం సీసీ రోడ్లకు మండల టీడీపీ నేతలతో కలిసి మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతిపురం మండల కేంద్రానికి మొదట విడతలో రూ.20 లక్షలకు సీసీ రోడ్లు మంజూరయ్యాయని తెలిపారు. మిగిలిన రోడ్లకు రెండవ విడతలో మంజూరవుతాయన్నారు. కెనమాకుల పల్లెకు సీసీ రోడ్డు మంజూరయ్యాయని, కాంట్రాక్టర్లు పనులు మొదలు పెట్టారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎల్.జయరామిరెడ్డి, రాజారెడ్డి, సర్పంచ్ ఏవీ జయరాం, శివకుమార్, రామకృష్ణ, రమేష్, కోదండ, శ్రీనివాసులు, బాలు, హేమాద్రి, పంచాయతీ కార్యదర్శి ఆశ్వర్థనారాయణ పాల్గొన్నారు.

ప్యాలెస్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు

కుప్పం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్యాలెస్ రోడ్డులో ఆకతాయిలు బైక్‌ల మీద అతివేగంగా వెళ్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ సమస్యను స్థానికులు కౌన్సిలర్ జిమ్ దాము దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో ఆర్ అండ్‌బీ అధికారులను సంప్రదించిన దాము, ప్యాలెస్ రోడ్డులో గురువారం స్పీడ్ బ్రేకర్ వేయించారు.

ఆటో బోల్తా : ముగ్గురికి గాయాలు

చౌడేపల్లె, నవంబరు21(ఆంధ్రజ్యోతి): ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో ముగ్గురికి గాయాలైన ఘటన చౌడేపల్లె మండలంలో గురువారం సాయత్రం జరిగింది. చుక్కావారి పల్లె నుంచి చౌడేపల్లెకు కొందరు వ్యక్తులు ఆటోలో వస్తున్నారు. బాలసముద్రం వద్ద ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గంగులమ్మ, నీలమ్మ, వసంతమ్మలకు గాయలయ్యాయి. వారిని స్థానిక పీహెచ్‌సీకి తరలించారు.

వెదురు కర్రల ట్రాక్టరు పట్టివేత



పలమనేరు,నవంబరు21(ఆంధ్రజ్యోతి):పలమనేరు రేంజి పరిధిలోని కలిమిచెట్లపెంట వద్ద బుధవారం రాత్రి అడవిలో నరికి ట్రాక్టరులో వెదురు కర్రలు తరలిస్తుండగా పట్టుకున్నట్లు రేంజర్ నారాయణ తెలిపారు. కలిమి చెట్లపెంట గ్రామానికి చెందిన అడ్డప్ప అడవిలో వెదురు కర్రలు నరికి తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో ట్రాక్టరు ను పట్టుకొని రూ.25వేలు కాంపొండు విధించినట్లు తెలిపారు.

మున్సిపల్ సమావేశం నిర్వహించండి

పలమనేరు,నవంబరు21(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించాలని కోరుతూ గురువారం కౌన్సిలర్లు కమిషనర్ రమణారెడ్డిని కోరారు. వార్డుల్లో పలు సమస్యలున్నాయని, అభివృద్ధి పనులకు సంబంధించి సమావేశంలో చర్చించాల్సి వుందని కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ చైర్‌పర్సన్ చాముండేశ్వరిను సంప్రదించి సమావేశ తేదీని తెలియజేస్తామని చెప్పారు. కమిషనర్‌ను కలిసిన వారిలో కౌన్సిలర్లు మురళీకృష్ణ, హైదర్, శ్యాంసుందర్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లా శ్రీనివాస్‌కు డాక్టరేట్



పుంగనూరు, నవంబరు21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సామాజిక కార్యకర్త, జర్నలిస్టు తల్లా శ్రీనివాస్‌కు స్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. గురువారం న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో జరిగిన కాన్ఫరెన్స్‌లో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఛుభావ్, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది డాక్టర్ వరప్రసాద్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నట్లు శ్రీనివాస్ తెలిపారు.

నేతిగుట్లపల్లె ప్రాజెక్టు నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి

వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు



నేతిగుట్లపల్లె ప్రాజెక్ట్‌ను రైతులతో కలసి పరిశీలిస్తున్న వ్యవసాయ కార్మికసంఘ అధ్యక్షుడు దడాల సుబ్బారావు

పుంగనూరు రూరల్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం నేతిగుట్లపల్లె సమీపంలో నిర్మించిన ప్రాజెక్టు నిర్వాసితులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన రైతులతో కలసి ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రైతులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా వారు భూములు ఇచ్చినట్లు అంగీకారం తెలిపినట్లు తప్పుడు సమాచారంతో ప్రభుత్వానికి సమాచారం ఇచ్చి ప్రాజెక్టు 95శాతం పనులు పూర్తి చేసినట్లు ఆయన ఆరోపించారు. ఆర్‌ఆర్ కంపెనీ పేరుతో కాంట్రాక్టు ఉన్నప్పటికీ బీఎల్‌ఆర్ కంపెనీ ప్రాజెక్టు పని పూర్తి చేసి రైతులను బెదిరించే పని చేసిందన్నారు. రైతులు హైకోర్టును ఆశ్రయించగా నష్టపరిహారం ఇచ్చిన తర్వాత పనులు చేయాలని ఆదేశించిందన్నారు. కోర్టు ఆదేశాలను తుంగలో తొక్కి రైతులను మోసం చేశారని మండిపడ్డారు. దాదాపు 10 గ్రామాల్లో 850 ఎకరాలు సేకరించి రైతుల కడుపుకొట్టారన్నారు. 2013 భూసేకరణ చట్టప్రకారం రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గంగరాజు, కార్మిక సంఘ నాయకులు ఓబుల్‌రాజు, రైతులు పులి వెంకటరమణ, కోలాట వెంకటరమణ, రమణమూర్తి, నరేశ్, కృష్ణమూర్తి, విజయ, రామాంజనేయులు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు 'విజన్'తో కుప్పం సుస్థిరాభివృద్ధి

ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌తో కుప్పం నియోజకవర్గం సుస్థిరాభివృద్ధి దిశగా శరవేగంగా అడుగులు వేస్తోందని ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, క్లస్టర్ ఇన్‌చార్జి వీజీ.ప్రతాప్ తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కుప్పంలో ఎయిర్‌పోర్ట్ నిర్మిస్తామంటే గతంలో కొంతమంది హేళన చేసిన విషయాన్ని పీఎస్ఎం గుర్తు చేశారు. ఇప్పుడు శాంతిపురం, రామకుప్పం మండలాల పరిధిలో 1500 ఎకరాలను ఎయిర్ పోర్టు కోసం సేకరించడంతోపాటు ఏవియేషన్ అధికారులు మూడు రోజులుగా సర్వే చేస్తున్నారన్నారు. ఎయిర్ పోర్టు వస్తే కుప్పానికి పరిశ్రమలు వస్తాయని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, భూముల విలువ పెరగడమేకాక, ఇక్కడి పంటలను దేశవిదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా రైతులు బాగుపడుతారని చెప్పారు. హంద్రీ-నీవా కాలువకు లైనింగ్ పనులు చేయాల్సి ఉన్నందున రీ ఎస్టిమేషన్లు వేస్తున్నారని, అందువల్ల కొంత ఆలస్యం అవుతోందన్నారు. ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ అవసరమైన రైతులందరికీ గోకులం షెడ్లు మంజూరవుతాయని చెప్పారు. వైద్యం శాంతారాం మాట్లాడుతూ త్వరలోనే తన అభ్యర్థన మేరకు టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్.నాయుడు, టీటీడీ అధికారులు నియోజకవర్గంలో పర్యటించనున్నారన్నారు. పురాతన ఆలయాల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ కస్టర్ ఇన్‌చార్జి వీజీ.ప్రతాప్, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, టీడీపీ నాయకులు పి.గోపీనాథ్, మల్లానూరు మాజీ సర్పంచి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పంలో కలెక్టరు ఆకస్మిక పర్యటన

గురుకుల విద్యాలయంలో పారిశుధ్య లోపంపై ఆగ్రహం



గురుకులం సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టరు

రామకుప్పం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : కలెక్టరు సుమిత్‌కుమార్ గురువారం కడ పీఓ వికాస్‌మర్మత్‌తో కలిసి రామకుప్పంలో ఆకస్మికంగా పర్యటించారు. తొలుత ఆయన పట్టశివార్లలోని డా.అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. విద్యాలయంలో పారిశుధ్యలోపం పట్ల ఆయన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం కొనసాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. శిథిలావస్థకు చేరుకుని, నిరుపయోగంగా ఉన్న డార్మెటరీ భవనాన్ని ఆయన పరిశీలించారు. కొత్త డార్మెటరీ విద్యార్థులకు సరిపోవడం లేదని, శిథిలావస్థకు చేరుకున్న పాత డార్మెటరీ స్థానంలో కొత్తది నిర్మించాలని ఎస్ఎంసీ చైర్మన్ సుబ్బయ్య కలెక్టరును కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతామని తెలిపారు. విద్యాలయంలో భవనాల నిర్మాణాలు, ఇతర వసతుల కల్పనపై ప్రణాళికలను సిద్ధం చేయాలని విద్యాలయ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన రామకుప్పంలోని మొద్రస్ కాలనీ, రామనగర్ కాలనీలను కలుపుతూ నిర్మించిన సిమెంటు రోడ్డును పరిశీలించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ ఏఎంసీ వైస్‌చైర్మెన్ సీతాపతి, నేతలు వెంకటరమణ, నవీన్, విజయ్‌కుమార్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి, పీఆర్ డీఈ గురువారెడ్డి పాల్గొన్నారు.

పుంగనూరు ఆస్పత్రిలో ఓపీ కోసం రోగుల ఇక్కట్లు



ఓపీ వద్ద క్యూ కట్టిన రోగులు, సిబ్బందిపై మండిపడుతున్న మెడికల్ ఆఫీసర్ మధుసూదనాచారి

పుంగనూరు, నవంబరు21(ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయినా ప్రయోజనం లేదని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. ఓపీలో చీటీలు తీసుకోవాలంటే గంటలకొద్దీ క్యూలో రోగులు ఇబ్బందులు పడక తప్పలేదు. ఓపీ చీటీలు ఇవ్వడానికి సిబ్బందిని ఏర్పాటు చేసినా వారు 10మందికి ఓపీ చీటీలు రాసి తర్వాత అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై మెడికల్ ఆఫీసర్ మధుసూదన్‌ఆచారికి రోగులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఓపీ సెంటర్‌ను పరిశీలించగా సిబ్బంది లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారులు స్పందించి ఓపీలో చీటీలు ఇవ్వడానికి సిబ్బందిని నియమించాల్సివుంది.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి : టీడీపీ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తెలిపారు. గురువారం మండల పార్టీ కార్యాలయంలో క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పంచాయతీలు, బూత్‌లవారీగా సభ్యత్వ నమోదు వివరాలను తెలిపారు. కొన్ని పంచాయతీలు ఇంకా పది, 20 శాతంలోనే ఉన్నాయని, కొన్ని పంచాయతీలు 60, 70 శాతం పూర్తి చేశారని తెలిపారు. ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేసి ఈనెల 25వ తేది లోగా వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఎంత కష్టపడినా గుర్తింపు లేనప్పుడు ఎందుకు పని చేయాలని యూనిట్ ఇన్‌చార్జ్‌లు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏదైన పని కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లితే మా అనుమతి లేనిదే వారికి పనులు చేయకూడదని కొంత మంది మండల స్థాయి నేతలు అధికారులకు హుక్కుం జారిచేస్తున్నారని ఆవేదన చెందారు. నేతల మధ్య సమన్వయం లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని ఇంక కొంత మంది యూనిట్ ఇన్‌చార్జ్‌లు తెలిపారు. దీంతో మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ సభ్యత్వ నయోదు పూర్తి అయిన తరువాత అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. అంతవరకు ఎవరు ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండా సభ్యత్వం పూర్తి చేయాలన్నారు. మండల ప్రధాన కార్యదర్శి పీవీ నాగరాజు, క్లస్టర్ ఇంచార్జ్‌లు విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు ఎల్.జయరామిరెడ్డి, ఆర్ఎస్ మణి, నారాయణస్వామి, రుద్రప్ప, రమేష్‌రెడ్డి, పెద్దన్న, బాలు, ఆంజనేయరెడ్డి, భాస్కర్, ఉయ్యాల జయరామిరెడ్డి, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి శాస్త్రవేత్త కావాలి



విద్యార్థుల ప్రయోగాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ ఆజాద్ హుస్సేన్ తదితరులు

శాంతిపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఒక శాస్త్రవేత్తగా ఎదగాలని అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ గణిత శాస్త్రవేత్తలు డాక్టర్ ఉదయకుమార్, ఆర్. అనిత, పరమ హంస యోగానంద విద్యాలయ ప్రిన్సిపాల్ ఆజాద్‌హుస్సేన్ అన్నారు. గురువారం సైన్స్ అండ్ మ్యాథ్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని పరమ హంస యోగానంద విద్యాలయంలో నిర్వహించారు. విద్యార్థులు సైన్స్, మాథ్స్ సంబంధించిన ప్రయోగాలను తయారు చేసి ప్రదర్శించారు వాటిని విద్యార్థులు, ఉపాధ్యాయులు పరిశీలించారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సైన్స్‌లో మంచి ప్రయోగాలు చేసి శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశానికి ఉపయోగపడాలన్నారు. తరువాత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పార్థవులు, కుప్పం తెలుగు మహిళ అధ్యక్షురాలు అనుసూయ, అక్షత, నారాయణరెడ్డి, సంపత్, సుమ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చలో పలమనేరును విజయవంతం చేయండి



చౌడేపల్లె, నవంబరు21 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న హలో మాల.. చలో పలమనేరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు మండలాధ్యక్షుడు కొత్తపల్లె మణి పేర్కొన్నారు. గురువారం స్థానిక బస్టాండు సమీపంలో వారు ఈనెల 23న జరిగే చలో పలమనేరు కార్యక్రమ పోస్టర్‌ను అవిష్కరించారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు శ్రీరాములు, చంగ్రలాయులు, రెడ్డిప్రసాద్, మణి పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్ : ఈనెల 23న చలో పలమనేరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పుంగమ్మ చెరువు కట్టపై చలో పలమనేరు కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘనాయకులు శ్రీనివాసులు, నాగరాజ, శంకర్, భాస్కర్, రెడ్డి, ఏడూరు శ్రీనివాసులు, నాగ, మంజు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి రూ.350 కోట్లు ఇవ్వండి

సీఎం చంద్రబాబును కోరిన చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్



చిత్తూరు సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరాభివృద్ధికి రూ.350 కోట్ల నిధులివ్వాలని సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కోరారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఈ మేరకు సీఎంకు వినతిపత్రం సమర్పించారు. 50 డివిజన్లలో నీటి సరఫరా పైపులైన్ల కోసం రూ.45కోట్లు, సీసీ, బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.90 కోట్లు, కాలువల నిర్మాణానికి రూ.70కోట్లు, పార్కుల సుందరీకరణకు రూ.12కోట్లు, చెరువుల పటిష్ఠత, అభివృద్ధికి రూ.10 కోట్లు, ప్రధాన రహదారుల్లో ఫుట్‌పాత్‌ల నిర్మాణానికి రూ.10కోట్లు, ఆధునిక విద్యుద్దీపాలు, సెంట్రల్ లైటింగ్ తదితరాలకు రూ.10కోట్లు, పాత కూరగాయల మార్కెట్‌ను ఇంటిగ్రేటెడ్ వెజిటేబుల్ మార్కెట్‌గా అభివృద్ధి చేయడానికి రూ.3కోట్లు, పాతబస్టాండ్ వద్ద ఆధునిక షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.100 కోట్లు కేటాయించాలని విన్నవించారు. స్పందించిన సీఎం నిధులు కేటాయింపుపై అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్నను ఆదేశించారు. దాంతో రూ.350 కోట్లు మంజూరు చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్‌కు ప్రద్యుమ్న లేఖ రాశారు.

చెరకు రైతులకు న్యాయం చేయండి



● నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్

నింద్ర/నగరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులు, ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు గురించి అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా జీరో అవర్‌లో నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ప్రస్తావించారు. రైతులకు సుమారు రూ.37కోట్లు, ఉద్యోగులకు సుమారు రూ.12కోట్లు బకాయిలు పెట్టారని.. ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. నాలుగేళ్ల నుంచి ఫ్యాక్టరీ మూతబడటం, బకాయిలను చెల్లించకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. మరోవైపు ఫ్యాక్టరీ వేలం వచ్చిందని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు.

హెచ్‌ఐవీ కేసులు నమోదవకూడదు : డీఎంహెచ్‌వో


సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో హెచ్‌ఐవీ కొత్త కేసులు నమోదవకుండా సెక్స్ వర్కర్లకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలని అధికారులను డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి ఆదేశించారు. గురువారం తన కార్యాలయంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అధికారులతో సమీక్షించారు. సెక్స్‌వర్కర్లు ఉన్న ప్రాంతాల్లో వారికి హెచ్‌ఐవీపై అవగాహన కల్పించాలన్నారు. హెచ్‌ఐవీ రోగులకు హెపటైటిస్‌బీ వ్యాక్సిన్ వేయించాలని, ఏఆర్‌టీ కేంద్రం నుంచి మందులు ఇప్పించాలని సూచించారు. అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకట ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మురుగును తొలగించాలని సూచిస్తున్న అనిల్ కుమార్ తదితరులు

తవణంపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణాధికారి అనిల్‌కుమార్ అన్నారు. గురువారం పొన్నేడుపల్లెలో అదనపు మలేరియా నివారణాధికారి రామచంద్రారెడ్డి, సిబ్బందితో కలిసి పర్యటించారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధానంగా మురుగు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. అనంతరం దోమల నివారణ చర్యలు చేపట్టారు. వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు మామిడి రైతులకు అవగాహన సదస్సు

ఐరాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండల మామిడి రైతులకు అవగాహన సదస్సును శుక్రవారం నాంపల్లెలోని ఎస్సీ సావిత్రమ్మ కళ్యాణ మండపం వద్ద నిర్వహించనున్నారు. వైఎస్ఆర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు మామిడి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తారని ఉద్యానశాఖ అధికారి సాగరిక ఒక ప్రకటనలో తెలిపారు.

పులివర్తి నాని జన్మదిన వేడుకలు


గిరింపేటలో అన్నదానం చేస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని జన్మదిన వేడుకలు నగరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో టీడీపీ నేతలు కార్యకర్తలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గాంధీ సర్కిల్, ఎమ్మెస్సార్ సర్కిల్, కొంగారెడ్డిపల్లె, సంతపేట, మురుకంబట్టు, గిరింపేట తదితర ప్రాంతాల్లో అన్నదానం చేశారు. నేతలు శంకర్, రాము కోడిబాబు, చిట్టిబాబు, వరలక్ష్మి, నందకుమార్, దయాలన్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరులో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలి : బీజేపీ

చిత్తూరు సెంట్రల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వానికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జిల్లాలో అత్యధిక శాతం బీసీలు ఉన్నారని, వీరి అభ్యున్నతికి చొరవ చూపాలని కోరారు.

హైస్కూల్ ప్లస్‌లను బలోపేతం చేయాలి: ఎన్టీఏ

చిత్తూరు సెంట్రల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హైస్కూల్ ప్లస్‌లకు జడ్పీ జూనియర్ కళాశాలలుగా పేరుమార్చి బలోపేతం చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్టీఏ) జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్ నాయుడు ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి సబ్జెక్టుకు టీచర్లను నియమించడంతో పాటు అన్ని గ్రూపులు ప్రతి కళాశాలలో ఉండేలా చూడాలని సూచించారు. ప్రస్తుతం మండలంలోని వాటిలో కేవలం బాలికల కళాశాలలు ఉన్నాయని, వీటిని కోఎడ్యుకేషన్‌గా మార్చితే మరింత బలోపేతం అవుతాయన్నారు. దీనిపై ప్రతిపాదనలను రాష్ట్ర నాయకత్వానికి పంపి, విద్యాశాఖ మంత్రికి విన్నవించనున్నట్లు పేర్కొన్నారు.

కలెక్టరేట్ ఎదుట 26న ధర్నా: సీఐటీయూ

చిత్తూరు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతు, కార్మిక విధానాలపై నిరంకుశ వైఖరిని ప్రదర్శిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 26వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి సురేంద్రన్ తెలిపారు. ప్రధాని మోదీ ఎప్పుడూ కార్పొరేట్ సంస్థలకే కొమ్ము కాస్తున్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.


పీసీఆర్ సర్కిల్ వద్ద

ఈ రోడ్లకు ప్యాచ్ వర్కులు

మరిచారా..?


గాంధీ రోడ్డు


నాయుడు బిల్డింగ్స్ రోడ్డు

● గుంతలమయమైన నగర వీధులు
● ప్రమాదాలకు గురవుతున్న ప్రజలు

చిత్తూరు అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గుంతలమయమైన రోడ్లకు ప్యాచ్‌వర్కులు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించినా... చిత్తూరులోని ప్రధాన రోడ్లన్నీ గుంతలమయంగానే ఉన్నాయి. నిత్యం వందలాది మంది వాహనదారులు, పాదచారులు వెళ్లే ఈ దారుల్లో గుంతలు ఏర్పడటంతో రాత్రి వేళల్లో, వర్షాకాలంలో ప్రమాదాలబారిన పడుతున్నారు. గతంలో గాంధీ రోడ్డులో ఏర్పడిన పెద్ద గుంతలకు స్థానికులే రెండుసార్లు వేలాది రూపాయలు ఖర్చు పెట్టి పూడ్చుకున్నారు. ప్రజల రాకపోకలు అంతంతగా ఉండే మైదా ఫ్యాక్టరీ వద్ద రోడ్డుకు ప్యాచ్‌వర్కును చేసిన అధికారులు నిత్యం వందలాది మంది వెళ్లే రోడ్లకు ఎందుకు వదిలేశారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని గుంతలమయమైన గాంధీ రోడ్డు, పీసీఆర్ సర్కిల్, నాయుడు బిల్డింగ్ రోడ్లకు ప్యాచ్‌వర్కులు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

విజిబుల్ పోలీసింగ్‌తో నేరాల నియంత్రణ: ఎస్పీ


కంప్యూటర్‌లో వివరాలను పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ

గంగాధరనెల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజిబుల్ పోలీసింగ్‌తో నేరాలను నియంత్రించవచ్చని ఎస్పీ మణికంఠ అన్నారు. గంగాధరనెల్లూరు పోలీస్‌స్టేషన్‌ను గురువారం తనిఖీ చేశారు. వృత్తినైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కేసులను త్వరగా పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మండలంలోని రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. ఫిర్యాదుదారుల సమస్యలను త్వరగా పరిష్కరించడంపై దృష్టి పెట్టాలన్నారు. సీఐ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో సినీ నిర్మాత


సాయికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నిర్మాత సాయి కొర్రపాటి గురువారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను సూపరింటెండెంట్ వాసు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

'వక్ఫ్ చట్టాల సవరణ'పై ముస్లింల నిరసన


నగరిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ముస్లింలు

నగరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్టాలను సవరిస్తూ, బోర్డులో ప్రభుత్వ జోక్యంపై గురువారం నగరిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ముస్లింలు నిరసన తెలిపారు. మసీదు వద్ద నుంచి ర్యాలీగా వచ్చి బస్టాండు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వక్ఫ్ అనేది తమ తాత, ముత్తాతలు ఇచ్చిన ఆస్తి అని ఏపీ తౌహిద్ జమాత్ (ఏటీజే)మండల అధ్యక్షుడు బషీర్ అన్నారు. దేశ అభివృద్ధి అంటే వక్ఫ్ బోర్డులో సవరణలు చేయడమేనా అని ప్రశ్నించారు.కార్యక్రమంలో మొహమ్మద్ రఫీ, సంసుద్దీన్, తౌహిత్ జమాత్ సభ్యులు, నగరి మున్సిపాలిటీ, మండల పరిధిలోని ముస్లింలు పాల్గొన్నారు.

పాఠశాల పనివేళల పెంపు నిర్ణయం విరమించుకోవాలి: ఎస్టీయూ


సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఎస్టీయూ నాయకులు

ఐరాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పని వేళల పెంపు నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఎస్టీయూ నాయకులు గురువారం డిమాండ్ చేశారు. ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా శాఖ అధ్యక్షుడు మదన్ మోహన్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు ఐదు నుంచి పది కిలోమీటర్ల దూరం నుంచి బస్సుల్లో పాఠశాలలకు వస్తారని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో పని వేళలను పెంచితే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు.

ఇలాగైతే రోగాలు రావా?

వెదురుకుప్పం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం గ్రామ పంచాయతీ కోణంగిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం రెండూ ఒకే చోట నిర్వహిస్తున్నారు. వీటి ముందు ఉన్న వీధిలో మురుగు నిల్వ చేరింది. దీనివల్ల దోమలు పెరిగాయి. ఇక్కడ చదువుకునే విద్యార్థులు వ్యాధుల బారిన పడకముందే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.


పాఠశాల ముందే నిల్వ ఉన్న మురుగు

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

చిత్తూరు సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమంగా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు చిత్తూరు అర్బన్ ఎక్సైజ్ సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. గురువారం చిత్తూరు రూరల్ మండలం చిత్తూరు- పొన్నై రోడ్డులోని తాళంబేడు క్రాస్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న మల్లికను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి 30 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిపై కేసును మోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

వెయ్యి లీటర్ల సారా ఊట ధ్వంసం



నగరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి, సీఐ సత్యనారాయణ తమ సిబ్బందితో కలిసి నగరి మండలంలోని ముడిపల్లె అటవీప్రాంతంలో దాడులు సారా స్థావరాలపై దాడులు చేశారు. వెయ్యి లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. నిందితుల కోసం గాలింపు చేపట్టినట్లు అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు.

కారు ఢీకొని దంపతులకు గాయాలు



యాదమరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో దంపతులకు గాయాలైన సంఘటన గురువారం మండలకేంద్రంలో జరిగింది. పెరుమాళ్లపల్లెకు చెందిన నారాయణ శెట్టి, గజలక్ష్మి దంపతులు ద్విచక్రవాహనంపై వెళుతుండగా గుర్తుతెలియని కారు ఢీకొనడంతో కిందపడి గాయపడ్డారు. స్థానికులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా గజలక్ష్మికి తలపైన గాయమవ్వడంతో మెరుగైన వైద్యంకోసం వేలూరు సీఎంసీకి తీసుకెళ్లారు. నారాయణ శెట్టి.. స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

ఎలక్ట్రానిక్ బైక్‌లతో పర్యావరణ పరిరక్షణ


ఈ-బైక్‌లతో అధికారులు, నేతల ర్యాలీ

గంగాధరనెల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ బైకల వినియోగంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, సీఐ లక్ష్మీనారాయణ, వెలుగు ఏపీఎం ఫరీద్‌మస్తాన్ అన్నారు. గంగాధరనెల్లూరు ఎంపీడీవో కార్యాలయానికి ఎదురుగా ఏడీఎంఎస్ ఈ-బైక్ బుకింగ్ ఆఫీసును గురువారం వీరు ప్రారంభించి, బైక్ ర్యాలీ నిర్వహించారు. నిర్వాహకులు, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



చిత్తూరు కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ సమీపంలోని జైహింద్, ఖాజీ పాఠశాలల్లోని విద్యార్థులకు తెలుగు సాహితీ సమితి ఆధ్వర్యంలో నీతి శతకాలపై ముద్రించిన పుస్తకాలను నిర్వాహకుడు తులసీనాథం నాయుడు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను టీచర్లు, విద్యార్థులు సత్కరించారు.

టీడీపీ కార్యకర్తకు నివాళి



బంగారుపాళ్యం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తుల దాడిలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన టీడీపీ కార్యకర్త కృష్ణమూర్తి మృతదేహాన్ని గురువారం స్వగ్రామమైన దండువారిపల్లెకు తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. వీరిలో.. టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, నాయకులు శ్రీరాములు రెడ్డి, జయచంద్ర నాయుడు, కమల్‌నాథ్ రెడ్డి, జనార్దన్ గౌడ్, రమేష్, రవీంద్ర నాయుడు, హరిప్రసాద్, చిన్నయ్య, రవి తదితరులున్నారు.

మీ నిర్లక్ష్యంతో మాకు చెడ్డపేరా?

● అధికారుల తీరుపై టీడీపీ నేత అసహనం


గుంతలమయంగా ఉన్న రోడ్డును చూపిస్తున్న పీటర్

గుడిపాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అధికారులు నిర్లక్ష్యం చేసేదానివల్ల స్థానిక ప్రజాప్రతినిధులకు చెడ్డపేరు వస్తోందని చిత్తూరు పార్లమెంటు ఎస్సీ సెల్ టీడీపీ అధ్యక్షుడు పీటర్ అసహనం వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా చిత్తూరు - వేలూరు జాతీయ రహదారిపై పానాటూరు, అనుపు, ఎంసీఆర్ క్రాస్ వద్ద గుంతలమయంగా మారి తరచూ ప్రమాదాలు జరిగి, ప్రాణాలు పోతున్నా.. అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానిక ప్రజాప్రతినిధులను ప్రజలు తిడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్తంగా..

25న జాబ్ మేళా

వెదురుకుప్పం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 25వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా విజయులురెడ్డి గురువారం తెలిపారు. నాలుగు కంపెనీల హెచ్‌వోడీలు హాజరవుతున్నారన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆధార్ కేంద్రం తనిఖీ

పాలసముద్రం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వెంగళ్రాజుకుప్పం ఏర్పాటుచేసిన ఆధార్‌కేంద్రాన్ని ఎంపీడీవో కృష్ణ మహేష్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి

నగరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీవో సతీష్ ఆదేశించారు. ఓజీకుప్పం ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని చెప్పారు.

తాగునీటి సమస్య రాకూడదు

వెదురుకుప్పం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని కార్వేటినగరం ఎంపీడీవో చంద్రమౌళి ఆదేశించారు. గురువారం గాజంకి గ్రామసచివాలయాన్ని తనిఖీ చేశారు. ఉద్యోగులకు సూచనలిచ్చారు.

మంచినే గ్రహించండి: ఎస్ఐ

గుడిపాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మంచినే గ్రహించాలని విద్యార్థులకు ఎస్ఐ రామ్మోహన్ సూచించారు. గురువారం నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు ఖాతుంబీ, టీచర్లు పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలసిన మాజీ ఎమ్మెల్యే

వెదురుకుప్పం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజును గురువారం టీడీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఆర్.గాంధీ మర్యాదపూర్వకంగా కలిశారు.

రూపేష్ కృష్ణకు అవార్డు



నింద్ర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నింద్ర మండలం కూనమరాజుపాలెంలోని మహాలక్ష్మి దేవస్థానంలో ప్రధాన అర్చకుడు రూపేష్ కృష్ణకు వివేకానంద ఆదర్శ రత్న సమ్మాన్ అవార్డు లభించింది.

మాల కార్పొరేషన్ సభ్యుడికి సన్మానం



వెదురుకుప్పం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాల కార్పొరేషన్ సభ్యుడిగా జీడీనెల్లూరు జనసేన ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న నియామకం కావడంతో గురువారం ఆయన్ను పలువురు సన్మానించారు. వీరిలో.. జిల్లా సంయుక్త కార్యదర్శి రాఘవ, కార్వేటినగరం బూత్ కన్వీనర్ సురేష్‌రెడ్డి ఉన్నారు.

ఊపందుకున్న టీడీపీ సభ్యత్వ నమోదు

వెదురుకుప్పం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు వెదురుకుప్పంలో ఊపందుకుంది. గురువారం పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి ఆధ్వర్యంలో వెదురుకుప్పం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. **పాలసముద్రం:** సభ్యత్వ నమోదులో పాలసముద్రం మండలం సత్తాచాటాలని టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి రాష్ట్ర భీమనేని చిట్టిబాబునాయుడు అన్నారు. గురువారం పాలసముద్రంలో సభ్యత్వ నమోదుపై నేతలతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, నేతలు రామస్వామి రాజు, రవినాయుడు, వెంకటేష్‌నాయుడు, వాసుయాదవ్, కృష్ణయ్య పాల్గొన్నారు.